RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

హైదరాబాద్ 27 జూన్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:25

డ్రగ్ ఫ్రీ తెలంగాణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. యువతలో సానుకూల ఆలోచనలు, విలువలు పెంపొందించి మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని "మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం" సందర్భంగా ఒక సందేశంలో పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలు వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయని, తద్వారా సమాజంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలకు దారితీస్తాయని అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అక్రమ రవాణాను అరికట్టేందుకు అవగాహన, అప్రమత్తత, సామాజిక బాధ్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి: శుక్రవారం గచ్చిబౌలిలోని శిల్పకళా వేదికలో ఈగల్ (EAGLE) ఫోర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన "సే నో టు డ్రగ్స్" అవగాహన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా ఉ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, వందేమాతరం మరియు రాష్ట్ర గీతాలను ఆలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణలో మాదకద్రవ్యాలకు ఏమాత్రం స్థానం లేకుండా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఈగల్ (జూ+బాజు) ఫోర్స్ మరియు తెలంగాణ స్టేట్ యాంటీ

నార్కోటిక్స్ బ్యూరో (TSNAB) డైరెక్టర్ శ్రీ సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన కోసం కఠిన చర్యలతో పాటు విస్తృత ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, డ్రగ్స్ నియంత్రణలో పనిచేస్తున్న పోలీసు శాఖ, ఈగల్ ఫోర్స్ సిబ్బందికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోందన్నారు.

విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని, "Say No to Drugs" సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలనలో చట్టాలు మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక నాయకులు, సినీ ప్రముఖులు యువతను చైతన్యపరిచే కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తుకు ముప్పు కలిగించే డ్రగ్స్ మాఫియాపై ఎంతటి కఠిన చర్యలైనా తీసుకోవడానికి ప్రభుత్వం వెనుకాడదని హెచ్చరించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం ఒక్కటే కాకుండా ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని అన్నారు. గ్రామాల నుంచి నగరాల వరకు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాంగంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వ్యతిరేక వాలంటీర్లుగా మారాలని, ఎక్కడైనా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, సినీ ప్రముఖులు, అధికారులు, సామాజిక కార్యకర్తలు కలిసి యువతలో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. చెడు మార్గం ఆకర్షణీయంగా కనిపించినా దాని ఫలితం వినాశనమేనని, మంచి మార్గంలో నడవడం ద్వారా మాత్రమే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజం సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో యువత సైనికుల్లా ముందుండి సమాజాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేస్తున్న ఈగల్ ఫోర్స్, పోలీసు శాఖ, మహిళా–శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ తో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల సేవలను అభినందిస్తూ, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సినీ నటుడు రామ్ పోతినేని, సినీ నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని, చదువులో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని కోరారు.

"నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని నేను డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ఉప ముఖ్యమంత్రి ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ శ్రీ సి.వి. ఆనంద్, ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ శ్రీ సందీప్ శాండిల్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, విద్యార్థులు మరియు పలువురు పాల్గొన్నారు.

ఈ నెల 28న పల్స్ పోలియో ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

వార్తా 2 లో

తెలంగాణ ప్రభుత్వ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు.. ఉత్తర్వులు జారీ

ఈ నెల 30తో ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం పూర్తి

1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు

ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతలు

జులై 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరణ

తెలంగాణ రాష్ట్ర కొత్త ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు ఇటీవలే కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ ఆయన్ను పేరెంట్ కేడర్‌కు బదిలీ చేసింది. మూడు రోజుల క్రితం ఆయన కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ అయ్యారు.

ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కే. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సంజయ్ జాజును రాష్ట్ర తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జులై 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎంసీఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో మూసీ రివర్ ఫ్రంట్ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష.

హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఎంపీ వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఎండీ నర్సింహారెడ్డి, ఎంఆర్డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్వరాజ్ అహ్మద్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్,మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు

మూసి మొదటి దశ ప్రాజెక్ట్ పైన చర్చ..

ముసి రివర్ బెడ్ లో ఉన్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి..

భూ సేకరణ కోసం ఆసక్తి ఉన్న వాళ్లకు టీడీఆర్ ఇవ్వాలి లేదా పరిహారం చెల్లించాలి ..

గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న డిఫెన్స్ భూముల్లో ఉన్న నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వమే తరలించాలి..

ప్రజల సందర్శన కోసం మూసీ ఎక్స్పీరియన్స్ సెంటర్ ను నక్లెస్ రోడ్ లో ఏర్పాటు చేయాలి..

మూసీ ప్రాజెక్ట్ లో చేపట్టబోయే పనులు సెంటర్ లో ప్రతిబింబించాలి..

ఇక్కడ ప్రాజెక్ట్ పైన ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలి ..

కొనసాగుతున్న బంద్

హైదరాబాద్, జూన్ 26 తెలంగాణ ప్రజలకు ముఖ్యమైన గమనిక.. మూడు రోజుల పాటూ రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలగనుంది. ఈ నెల, 27, 28 తేదీల్లో సేవలు నిలిపివేయనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్, అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించి సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో తెలియజేశారు. 28న ఆదివారం కావడంతో ప్రభుత్వ సెలవులు వచ్చాయి. ఈ నెల 27న పనిదినం.. ఆ ఒక్కరోజు రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి యథావిధిగా సేవలు పునఃప్రారంభమవుతాయని గాంధీ తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఈ షెడ్యూల్ రూపొందించామన్నారు. సర్వర్ నిర్వహణ ప్రక్రియతో పాటుగా ఆన్‌లైన్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేసేలా మూడు రోజుల పాటూ పనులు చేపడతామన్నారు. భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, సేవల్లో నాణ్యత మెరుగుపర్చడం కోసం నిర్వహణ పనులు చేయబోతున్నట్లు తెలిపారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నారు. ప్రజలు ఈ షెడ్యూల్ ప్రకారం రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన పనుల్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు అధికారులు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారుతెలంగాణలో ప్రతిరోజూ భారీగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి.. ఒకవేళ రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడితే ప్రభుత్వానికి కూడా కొంత నష్టం తప్పదు. అందుకే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఈ సర్వర్ నిర్వహణ పనుల్ని సెలవు దినాల్లో కలిసొచ్చేలా ప్లాన్ చేసింది. అప్పుడు ప్రజలకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. మూడు రోజుల పాటూ ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతుండగా.. ఈ నెల 26న మొహర్రం సెలవు దినం, ఈ నెల 27న మాత్రం పనిదినం, ఈ నెల 28న మళ్లీ ఆదివారం వచ్చింది.

ప్రజాబలం

27 జూన్ 2026 శనివారం

త్రిశూల్ వ్యూహంలో ఎన్డీఏ

నాలుగోసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. త్రిశూల వ్యూహంతో పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సర్, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తోంది. బీహార్, బెంగాల్‌లో అనుసరించిన ఫార్ములానే?2029 ఎన్నికల్లో అమలు చేసేందుకు రెడీ అవుతోంది. ఇదే ఇవాళ్టీ స్టోరీ బోర్డు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. ఇక్కడ ఎన్నికలదే కీలక పాత్ర. అలాంటప్పుడు ఓటర్ల విషయంలో వారి అర్హతలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవటం చాలా అవసరం. ఈ ఉద్దేశంతోనే సర్ ప్రక్రియకు రూపకల్పన జరిగింది. కాకపోతే ఇప్పుడు జరుగుతున్నది సర్ కాదు ఓట్ల చోరీ అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈసీ మాత్రం అవన్నీ అపోహలేనని కొట్టిపారేస్తోంది.దేశంలో ఓటర్ల జాబితాను అప్పుడప్పుడూ సవరించడం తప్పనిసరి. అర్హులకు చోటు కల్పించి అనర్హులపై వేటు వేసేందుకు సర్ నిర్వహించడమూ అవసరమే. దీని పై ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండనవసరం లేదు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 పూర్తి స్వేచ్ఛను కల్పించింది. ఈసీ ఈ విషయం లో ఎవరి అనుమతి తీసుకోవాల్సిన లేదా ఎవరికీ జవాబుదారీ వహించాల్సిన అవసరం లేదు. దేశంలో ఇలాంటివి జరగడం ఇదే కొత్త కూడా కాదు. 1952 నుంచి 2004 వరకు 13 సార్లు సర్ జరిగింది. కానీ, ప్రస్తుత సర్వే స్థాయిలో అవేవీ వివాదాల్లో చిక్కుకోలేదు. అయితే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కొడిగట్టిన ప్రస్తుత తరుణంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. సర్ పేరిట జరుగుతున్న తతంగమంతా బీజేపీకి సానుకూలత, విపక్షాలకు ప్రతికూలత కల్పించేందుకేనని, అందుకు కృత్రిమమైనరీతిలో చేర్పులు, ప్రక్షాళనలు జరుగుతున్నాయని ప్రధానమైన ఆరోపణ. పనిలోపనిగా పౌరసత్వ పరీక్షలూ జరుగుతున్నాయనేది మరో ఆరోపణ.దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికల సంఘం సర్వే చేపట్టింది. అందులోనూ మొదటి విడతగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించడంపై ఇప్పటికే తీవ్ర దుమారం చెలరేగింది. మార్పుల తర్వాత జాబితాలో 50 లక్షలకు పైగా ఓటర్ల పేర్లు గల్లంతు కావడంపై పార్లమెంటు కూడా దద్దరిల్లింది. ఈ వివాదం ఒక కొలిక్కి రాకుండానే దేశమంతటా సర్ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎన్నికల కమిషన్ గత అక్టోబర్ 27న ప్రకటించింది. దీనిపై విపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత తెలిపాయి. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రతిఘటించి తీరుతామని శపథం పూనాయి. కానీ తీవ్ర నిరసనల మధ్యే సర్ ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల్లో తమ ఓటమికి సర్ తోనే పునాది పడిందని బెంగాల్లో మమతా బెనర్జీ సుప్రీందాకా వెళ్లి మరీ ప్రతిఘటించారు. దీంతో సుప్రీంకోర్టు సర్ ప్రక్రియ కోసం జ్యుడీషియల్ అధికారులను నియమించింది. చివరకు వారిని కూడా ఘెరావ్ చేసే దుస్థితి రావడం, తమ ఆదేశాల్ని కూడా బెంగాల్ రాష్ట్ర యంత్రాంగం బేఖాతరు చేయడాన్ని సుప్రీం తీవ్రంగా పరిగణించింది. కేంద్ర బలగాల రక్షణలో సర్ జరగాల్సిందేనని, సర్‌కు ఎక్కడైనా ఆటంకాలు ఎదురైతే చూస్తూ ఊరుకునేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. సర్ నిబంధనల మేరకు జరగకపోతే ఆధారాలతో ఫిర్యాదు చేయొచ్చు కానీ.. అసలు ప్రక్రియనే వద్దనడం పద్ధతి కాదని సర్వోన్నత న్యాయస్థానం పార్టీలకు తలంటింది.ఉత్తరప్రదేశ్ సర్‌లో ఏకంగా సుమారు 20 శాతం ఓటర్ల పేర్లు, అంటే 2.89 కోట్ల ఓట్లు గల్లంతవడం కలకలం రేపింది. రాష్ట్రంలోని మొత్తం ఓట్ల సంఖ్య 15.44 కోట్ల నుంచి 12.55 కోట్లకు తగ్గిపోయింది. ఇక రాజధాని లక్నోలో 39.9 లక్షల ఓట్లుంటే అందులో 30 శాతం సర్వేలో ఎగిరిపోయి చివరకు 27.9 లక్షలే మిగిలాయి. అందులో కొందరు ఓటర్లు చనిపోయారని, మరికొందరు వేరే ప్రాంతాలకు వలసపోయారని, ఇంకొందరి పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువచోట్ల ఉన్నాయని కమిషన్ వివరణ ఇచ్చింది. ఏదేమైనప్పటికీ భారీ స్థాయిలో ఓట్ల తొలగింపుపై రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ కార్యక్రమం వల్ల ఓటర్లలో కొన్ని వర్గాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది.సర్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో తమిళనాడు న్యాయపోరాటానికి దిగింది. ఎన్నికల సంఘం చేపట్టిన సవరణకు ఎలాంటి రాజ్యాంగ బద్ధత, చట్టబద్ధత లేదని, పారదర్శకత, సమన్యాయం లోపించాయని ఆరోపించింది. బెంగాల్‌లో ఏకంగా నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌కు సర్ యంత్రాంగం విచారణ నోటీసు పంపించడంపై వివాదం రేగింది. దేశ విభజన నుంచి బంగ్లా యుద్ధం దాకా అనేక చారిత్రక కారణాల వల్ల బెంగాల్‌లో పౌరసత్వ సమస్యలున్నాయి. సర్ పేరిట దొడ్డిదారిన సిటిజన్‌షిప్ రిజిష్టర్‌ను ప్రవేశపెడుతున్నారని టీఎంసీ మండిపడింది. ఈ వివాదాల వెనుక నిజానిజాల మాట అటుంచితే, ప్రజలకూ, పార్టీలకూ సర్‌పై అంతులేనన్ని అనుమానాలున్నాయన్న మాట నిజం. పార్టీలు ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల సంఘంపై కూడా నమ్మకం ఉంచటం లేదు. అయితే బెంగాల్ సర్ విషయంలో అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని అడిగితే.. ఏ పార్టీ నుంచీ స్పందన రాలేదు. కనీసం తుది జాబితాపై అభ్యంతరాలు అడిగినా.. ఎవరూ ముందుకు రాలేదు. తగినంత సమయం ఇచ్చిన తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో.. సర్‌ను రాజకీయ వివాదంగా మార్చొద్దని సుప్రీంకోర్టు చెప్పాల్సి వచ్చింది.ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ.. సర్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను పీసీసీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉన్నందున ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా 2-3 నెలల్లో హడావిడిగా ముగించకుండా, ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని సూచించింది. సర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకోవడానికి గడువును 3 నెలలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే జనగణన ప్రక్రియ జరుగుతున్నందున దాంతోపాటే సర్ నిర్వహిస్తే.. సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళ కూడా ఉంది. బూత్ లెవెల్ అధికారులు ప్రత్యక్షంగా 3-4 సార్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు తనిఖీ చేయాలి. విదేశీయులు ఉన్నారనే నెపంతో ఓట్లు తొలగించే ప్రక్రియ సరికాదనే సూచనలు వస్తున్నాయి.ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం సర్ అవసరమే అనే వాదనతో అన్ని పార్టీలూ ఏకీభవిస్తున్నాయి. కానీ సర్ ప్రక్రియకు ఎంచుకుంటున్న సమయం, సందర్భంపై మాత్రం భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. ఇక్కడ అవకతవకలు ఉన్నాయా.. లేదా అనేది పక్కనపెడితే.. అసలు అనుమానాలు కలిగేలా ఎందుకు వ్యవహరించాలనే ప్రశ్నకు మాత్రం కచ్చితంగా జవాబు వెతకాల్సిందే. అటు పార్టీలు,ఇటు ఓటర్లు అందరిలోనూ నమ్మకం కలిగించే విధంగా ఈసీ విధానాలకు పదునుపెట్టాలనే సలహాలు వస్తున్నాయి. అనవసర ఆందోళనలు, వివాదాలకు తావివ్వకుండా.. ఎవ్వరూ వేలెత్తిచూపటానికి వీల్లేని విధంగా తెలుగు రాష్ట్రాల్లో సర్ జరగాలనే భావన వ్యక్తమవుతోంది. అయితే మన దగ్గర బీహార్, బెంగాల్ మాదిరి రగడకు ఆస్కారం లేదని, ఇక్కడ చాలావరకు ఓటర్లకు సరైన పత్రాలుంటాయనే అభిప్రాయాలు కూడా లేకపోలేదు.

మహబూబాబాద్ ప్రధాన రహదారిపై పైప్‌లైన్ పనుల పేరిట వ్యాపారుల జీవనాధారానికి గండి?

మహబూబాబాద్ ప్రజాబలం ప్రతినిధి"మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణ లేదా? కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా పనులు.. దుకాణదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో!"

మహబూబాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన పైప్‌లైన్ వేసే పనులు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి.

జేసీబీలతో కాలువలు తవ్వి, తవ్విన మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలించి, పైప్‌లైన్‌ను నామమాత్రంగా వేసి పనులు ముగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రోడ్డు పక్క భాగం పూర్తిగా దెబ్బతిని, దుకాణాలకు వచ్చే వినియోగదారులు నడవడానికి కూడా వీలు లేకుండా పరిస్థితి తయారైంది. వ్యాపారులు రోజువారీ ఆదాయం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇది అభివృద్ధి పనులా? లేక మహబూబాబాద్ పట్టణాన్ని అస్తవ్యస్తం చేసే నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ముఖ్యంగా ఈ పనులు మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయా? లేక అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రధాన రహదారిపై దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాదచారులకు సరైన మార్గం లేకపోవడం, దుమ్ము, బురద, ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజల ప్రశ్నలు:

పనులు పూర్తయ్యాక రోడ్డు పక్క భాగాన్ని యథావిధిగా పునరుద్ధరిస్తారా?

వ్యాపారులకు కలుగుతున్న నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు?

మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్ల పనితీరును పరిశీలిస్తారా?

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రధాన రహదారిని యథాస్థితికి తీసుకురావాలని మహబూబాబాద్ ప్రజలు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

మాదకద్రవ్యాలపై సమరభేరి -- వరంగల్‌లో 2ఖ రన్‌కు భారీ స్పందన

వరంగల్, జూన్ 26: "సే నో టు డ్రగ్స్ -- యెస్ టు లైఫ్" అనే నినాదంతో మాదకద్రవ్యాల నిర్మూలన, యువతలో చైతన్యం కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ నగరంలో భారీ 2ఖ రన్ నిర్వహించారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు రిటైర్డ్ ఐపీఎస్, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి గార్లతోపాటు

వరంగల్ పోలీస్ కమిషనర్

సంప్రత్ సింగ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గార్లు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ఈ ర్యాలీ నగర ప్రధాన వీధుల మీదుగా హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు కొనసాగింది.

"మాదకద్రవ్యాలు వద్దు -- ఆరోగ్యమే ముద్దు", "డ్రగ్స్ ఫ్రీ వరంగల్" వంటి నినాదాలతో విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజపాయి, ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి దార కవిత, డిసిపి అంకిత్ కుమార్, పలువురు జిల్లా అధికారులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ర్యాలీ లో పాల్గొన్నారు.

ర్యాలీ అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన ముగింపు సభలో 2ఖ రన్ విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సంప్రిత్ సింగ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని కూడా నాశనం చేస్తాయని అన్నారు. యువత చెడు స్నేహాలు, క్షణిక ఆనందం కోసం డ్రగ్స్‌కు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కమిషనరేట్ పరిధిలో కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని, ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. నాగరాజు మాట్లాడుతూ, డ్రగ్స్ సమస్య కేవలం పోలీసు శాఖదే కాకుండా సమాజం మొత్తానికి సంబంధించినదని అన్నారు.

గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు అందరూ కలిసి యువతను క్రీడలు, యోగా, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ నెల 28న పల్స్ పోలియో ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించాలని స్పష్టం చేశారు. జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలియో బూత్‌లలో డ్రాప్స్ వేయనున్నట్లు, జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసేందుకు ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు విస్తృతంగా ఉండటంతో జూలై 1న అదనంగా మరో రోజు కార్యక్రమాన్ని నిర్వహించాలని మంత్రి సూచించారు.

"ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్‌లు, 903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సుమారు 40.97 లక్షల మంది 0--5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 52.04 లక్షల బీవోపీవీ (ఎఫ్రాఎ) టీకా డోసులు జిల్లాలకు సరఫరా చేశారు. కార్యక్రమంలో 8,393 ఏఎన్ఎంలు, 27,181 ఆశా కార్యకర్తలు, 34,442 అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.

వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదు అయిందని, పోలియో రహిత తెలంగాణ లక్ష్యాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించామని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేశారు.

"జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో టీకా వేయించాలి. గతంలో పోలియో చుక్కలు వేయించినా మరోసారి వేయించడం వల్లే పూర్తి రక్షణ లభిస్తుంది. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి టీకా వేయించాలి. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా అందరూ సహకరించి తెలంగాణ, దేశం పోలియో రహిత హోదాను కొనసాగిద్దాం" అని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు.

జూన్ 30 తర్వాత వీరికి గ్యాస్ కనెక్షన్ రద్దు..

న్యూఢిల్లీ జూన్ 26;ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ నుండి పీఎన్‌జీ కనెక్షన్‌లకు మారేందుకు వినియోగదారులకు ఇచ్చిన గడువు జూన్ 30తో ముగియనుంది. మార్చిలోఇరాన్–అమెరియా యుద్ధం వల్ల పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కీలక ఆదేశాల జారీ జారీచేసింది.అదేంటంటే.. ఒక కుటుంబం ఎల్పీజీ, PNG కనెక్షన్ రెండింటినీ కలిగి ఉండకూడదు. పైప్‌లైన్ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నచోట పీఎన్‌జీలోకి మారాలి. తమకు ఉన్న ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కనెక్షన్లను సరెండ్ చేయాలి. ఇందుకు 90 రోజుల గడువు ఇవ్వగా.. జూన్ 30తోముగుస్తుంది. దీంతో ఆ తర్వాత ఏం జరుగుతుందనేది సర్వత్రాచర్చనీయాంశమవుతోంది. పీఎన్‌జీలోకి మారని వినియోగదారుల ఎల్పీజీ కనెక్షన్లను రద్దు చేస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఒక ప్రాంతంలో PNG మౌలిక సదుపాయాలు ఉండి,గడువు గురించి ఒక కుటుంబానికి తెలియజేసినప్పటికీ వారు మారకపోతే ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్‌ను నిలిపివేసేఅవకాశముంది. ఇప్పటికే PNG కనెక్షన్ కలిగి ఉండి ఇంకా LPG సిలిండర్లను ఉపయోగిస్తున్న వారు వాటిని తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఎందుకంటే ఒక కుటుంబం రెండు కనెక్షన్లనుఉపయోగించకూడదనే నిబంధన ఉంది. ఒకవేళ గ్రాడ్+ ఇంకా ఒక ప్రాంతానికి చేరుకోకపోతే అక్కడ పైపుల ద్వారా గ్యాస్ అందుబాటులోకి వచ్చే వరకు LPG కనెక్షన్‌ను ఉపయోగించుకోవచ్చు.దేశవ్యాప్తంగా సుమారు లక్ష కుటుంబాలు ఇప్పటికే పీఎన్‌జీకి మారాయి. మార్చి 2026 నుండి 10.02 లక్షల పీఎన్‌జీ కనెక్షన్లకు గ్యాసిఫికేషన్ చేయబడింది. మరో 3.22 లక్షల కనెక్షన్లకు మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి. దీంతో పీఎన్జీ కనెక్షన్ల మొత్తం 13.24 లక్షలకు చేరుకుంది. దాదాపు 9.94 లక్షల మంది వినియోగదారులు కొత్త కనెక్షన్ల కోసం నమోదు చేసుకున్నారు.

గడువు తేదీకి కేవలం కొన్ని రోజులే మిగిలి ఉన్నందున ప్రజలు చివరి నిమిషం వరకు వేచి ఉండవద్దని అధికారులు సూచిస్తున్నారు. ముందుగానే జాగ్రత్తలు తీసుకుని ప్రభుత్వ ఆదేశాలు పాటించడం వల్ల వంటగ్యాస్ సరఫరాలో చివరి నిమిషంలో కలిగే అంతరాయాలను నివారించవచ్చు. ఇక పైపుల ద్వారా వచ్చే గ్యాస్‌కు మారే ప్రక్రియను సులభతరం చేసుకోవచ్చు. తమ ప్రాంతంలో పైపుల ద్వారా గ్యాస్ సేవ అందుబాటులో ఉన్నప్పటికీ.. ఇంకా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తుంటే జూన్ 30 లోపు దరఖాస్తు చేసుకోవడం ప్రారంభించాలని అధికారులు సూచిస్తున్నారు. లేకపోతే ప్రస్తుతం ఉన్న ఎల్పీజీ కనెక్షన్ రద్దయ్యే ఛాన్స్ ఉంది. ఇప్పటికైనా వినియోగదారులు అలర్ట్ అయితే మంచిదని చమురు కంపెనీలు సూచిస్తున్నాయి.

డ్రగ్స్ నియంత్రణ ప్రతిఒక్కరు బాధ్యత

గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి. "

వరంగల్ జూన్ 26 ; డ్రగ్స్ నియంత్రణ ప్రభుత్వం బాధ్యతే కాదు తల్లితండ్రులు వైద్యులు పోలీసులు మేధావులు స్వచ్ఛంద సంస్థలు సినీ ప్రముఖులుఉపాధ్యాయులు అందరి బాధ్యత అని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అని అన్నారు. శు క్రవారం హంటర్ రోడ్డు లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అరికట్టాలంటే నార్కోటి కంట్రోల్ రూమ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాల కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నార్కోటి కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు డ్రగ్స్ ని అమ్మేవారిని పై కఠిన చర్యలు తీసుకుంటూ వారికి కౌన్సిలింగ్ ద్వారా మంచి మార్గంలో నడిచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుంది జిల్లాలలో కమిషనర్ ఎస్పీ కలెక్టర్ వాళ్ల చెరువుతో మాదకద్రవ్యాలను అరికట్టడం అర్హనీయం ముఖ్యంగా సప్లై చేసే ఏరియాలో కాలేజీలు సినిమా హాలు కేసులు క్లబ్బులు హాస్టల్స్ దగ్గర నిఘా ఏర్పాటు చేయాలి ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా కాకుండా బార్డర్లలో సరైన జాగ్రత్తలు తీసుకొని ఎవరైతే గంజాయి రవాణా చేస్తారో వారిని పట్టుకొని వారిపై కఠిన చర్యలుతీసుకోవాల్సిందిగా కోరుతున్నాను డ్రగ్స్ అంతరించాలంటే మాదకద్రవ్యాలు అరికట్టాలంటే ప్రతి ఒక్కరు వారి భుజాల మీద వేసుకొని దానిపై పోరాడితేనే తప్ప అది అరికట్టలేమని రాజనాల శ్రీహరి అన్నారు వెంటనే ప్రభుత్వం ప్రజలు అధికారులు అందరూ చొరవతో డ్రగ్స్ ను గంజాయిని మాదకద్రవ్యాలను అరికట్టాల్సిందిగా రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో పోలేపాక ప్రసాద్ తులసి శశి మాగంటి శివగంగ్రకోట రామచందర్ లో పాల్గొన్నారు

రైతులకు రూ 2లక్షల రుణమాఫీ చేయాలి .

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్.

రుద్రవరం. రైతులు కౌలు రైతుల పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీ జరిగే మహాధర్నాలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని చలోవిజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం రైతు సంఘం నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే భాస్కర్ రుద్రవరం మండలం కార్యదర్శి బాల నరసింహుడు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మన రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది ఎన్నికల ముందు కూటమినేతలు గుప్పించిన వాగ్దానాలు గాలి మేడలు అయ్యాయి. క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను తీర్చడానికి ఎలాంటి చర్యలు ఈ ప్రభుత్వాలు చేపట్టడం లేదు. మాది రైతు ప్రభుత్వం రైతు సంక్షేమం అందిస్తున్నామంటూ ప్రచార మాధ్యమాల్లో కోట్లాది రూపాయలతో డొంగ ప్రచారాలు చేసుకోవడం తప్ప రైతులను ఆదుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వాలు ఉండడం లేదు. పంటలకు కనీసం మద్దతు ధర దక్కడం లేదు .సిండికేట్ మార్కెట్ మాయాజాలంలో చిక్కుకొని రైతులు చాలా నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు .కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. కాబట్టి రైతు సంఘం గా మేము చేస్తున్న డిమాండ్ ఏమంటే రైతులకు తక్షణమే రూ2లక్షల రుణమాఫీ ప్రకటించాలి పండిన పంటలకు మద్దతు ధరలు కల్పించాలి. సాగు ఖర్చులు తగ్గేందుకు పెట్రోల్ డీజిల్ వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు తగ్గించాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా పంట రుణాలు ఇవ్వాలి .కౌలు రైతులకు ఎలాంటి హామీ లేకుండా ఆర్బీఐ నిబంధన ప్రకారం ర2 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలి . పంటల బీమా ఇన్పుట్ సబ్సిడీ ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలి. మొక్కజొన్న రైతులకు రైతుల దగ్గర పంట ఉన్నప్పుడే సకాలంలో పంట కొనుగోలు ఏర్పాటు చేసి మద్దతు ప్రకారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి .ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు 7 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి సాగునీటి సౌకర్యాలు మెరుగుపరచాలి .తెలుగు గంగా కెనాల్ కింద పంట కాలువల నిర్మాణం చేపట్టాలి ధరల స్థిరీకరణ ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధరలు ప్రకారం రైతుల పంటను కొనుగోలు చేయాలి. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలపై సమరభేరి మోగించేందుకు జూన్ 30న విజయవాడ ధర్నా చౌక్ వద్దకు వేలాదిగా రైతులు కౌలు రైతులు తరలివచ్చి జూన్ 30న విజయవాడ ధర్నా చౌక్ లో జరిగే మహా ధర్నాలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తున్న రైతులు ఇప్పటికైనా మేల్కొని ప్రశ్నించకపోతే రైతు కనీసం ఒక్క ఎకరం పండించడానికి కూడా ఎరువులు తెచ్చుకోలేని పరిస్థితి ఇప్పటి పాలక ప్రభుత్వాలు కల్పిస్తా ఉన్నాయి. కాబట్టి రైతు లోకమా మేలుకో మీ హక్కులకై పోరాడు పాలకుల కళ్ళు తెరిపించడానికి మన హక్కులను సాధించుకోవడానికి తరలిరండి జూన్ 30న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి. ఈ కార్యక్రమంలో రుద్రవరం మండల రైతు సంఘం అధ్యక్షులుమిట్టపల్లె నరసింహులు పెద్ద కమ్మలూరు శాఖ కార్యదర్శి ఏ నాగ నరసింహుడు రుద్రవరం రైతు సంఘం కార్యదర్శి కరీముల్లా రైతులు పుల్లయ్య వెంకటేశ్వర్లు సత్యనారాయణ రామాంజనేయులు రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పంట పోలాల్లో సోలార్ ఉత్పత్తి

(సి.హెచ్.ప్రతాప్)

వ్యవసాయం లాభసాటిగా మారాలంటే పంటలతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా పంట పొలాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి ఒక వినూత్న పరిష్కారంగా మారుతోంది. సాగు భూమిలో ఎత్తుగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి, కింద పంటలు సాగు చేయడం ద్వారా రైతులు ఒకేసారి వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంది. దీనినే "అగ్రివోల్టాయిక్స్" గా పిలుస్తారు.

తెలంగాణ ఈ రంగంలో ముందంజ వేయగల సామర్థ్యం కలిగిన రాష్ట్రం. రాష్ట్రంలో ఏడాది పొడవునా అధిక సౌర వికిరణం ఉండటం, విస్తారమైన వ్యవసాయ భూములు ఉండటం దీనికి అనుకూలంగా మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ పీఎం-కుసుమ్ పథకం కింద తెలంగాణలో 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల వరకు వికేంద్రీకృత సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం లభిస్తోంది. రైతులు, రైతు సంఘాలు, పంచాయతీలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఏర్పాటు చేసే విద్యుత్‌ను డిస్కంలు దీర్ఘకాలిక ఒప్పందాలతో కొనుగోలు చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఈ పథకం ద్వారా 4,000 మెగావాట్ల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చర్యలు కొనసాగుతున్నాయి.

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తరించే చర్యలను కూడా వేగవంతం చేస్తోంది. పైలట్ ప్రాతిపదికన అనేక గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ అందిస్తూ, ప్రతి మండలంలో ఒక సౌర గ్రామం ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలిస్తోంది.

సరైన విధానాలు, సబ్సిడీలు, సాంకేతిక సహకారం అందితే పంట పొలాల్లో సోలార్ ఉత్పత్తి తెలంగాణ రైతుకు స్థిరమైన ఆదాయం, విద్యుత్ భద్రత, పర్యావరణ పరిరక్షణను ఒకేసారి అందించే మార్గంగా నిలుస్తుంది. భవిష్యత్తులో "అన్నదాత"తో పాటు "శక్తిదాత"గా కూడా తెలంగాణ రైతు దేశానికి ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది.

వోట్ తో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు

సర్ ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలి

టీపీసీసీ ఉపాధ్యక్షుడులిసంగిశెట్టి జగదీష్

హైదరాబాద్ జూన్ 26 ;సర్ ప్రాముఖ్యత అందరూతెలుసుకోవాలని,వోట్ తో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు రాజ్యాంగం మనకి కనిపించిందనిటీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్అన్నారు.శుక్రవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ

పాస్పోర్ట్ అనేది కూడా సిటిజెన్ షిప్ కాదు అంటున్నారూ

బీజేపీ మెంబెర్ షిప్ ఉంటేనే సిటిజెన్ గా కన్సిడర్ చేస్తున్నారు

ఇతర రాష్ట్రాల లో ??× పేరుతో బీజేపీ ఎలా అధికారం లోకి వస్తుందో మనం చూసాం

ఇప్పటి వరకు 8 సార్లు ??× ప్రక్రియ జరిగింది దేశం లో తెలంగాణ మా టార్గెట్ అని బీజేపీ నేతలుమాట్లాడుతున్నారు బీజేపీ వోట్ చోరీ , ఈవీఎం చోరీ , సీటు చోరీతో పాటు, పార్టీ చోరీ , రాముని గుడి చందా చోరీ కూడా చేస్తుందని విమర్శించారు.

వోట్ అప్లై చేసుకోటవం అందరి బాధ్యత, అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జగదీష్ కోరారు.

డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా ముందుకు......

యువత, విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

తమ భవిష్యత్ ప్రణాళిక వైపు పయనించాలి

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు×

డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

రాజన్న సిరిసిల్ల డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై జిల్లావ్యాప్తంగా విద్యాలయాల్లో వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ మీదుగా పద్మనాయక కళ్యాణ మండపం వరకు నిర్వహించారు.అనంతరం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, నష్టాలపై స్కూల్ విద్యార్థులు, సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేశాయి. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వివిధ స్టాళ్లను అతిథులు పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు

పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట

సే నో టూ డ్రగ్స్.. సే ఎస్ టూ లైఫ్ నినాదాలు చేశారుఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన చేశారని గుర్తు చేశారు ఇందులో భాగంగా డ్రగ్స్ ను నిర్మూలించేందుకు రాష్ట్రంలో ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు చేస్తుందని తెలిపారు. యువత, విద్యార్థులకు డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు.యువత సన్మార్గంలో వెళ్లేలా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. యువత విద్యార్థులు మత్తు పదార్థాల బాట ను వీడండి.. మైదానం బాట పట్టండి అని సీఎం పిలుపు నివ్వారని గుర్తు చేశారు. యువత సన్మార్గంలో నడవాలని పిలుపు నిచ్చారు. ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ పై దాడులు, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు.పోలీస్ శాఖ శాంతి భద్రతల తో పాటు పోలీసులు రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారని, హెల్మెట్ ధరించాలని కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని, సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక చర్యలు తీ సు కుం టు న్నా రు ని అభినందించారు.యువత, విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించేలా ఒలింపిక్స్ లో పతకాలు సాధించేలా రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ యూనివర్సిటీ తీసుకువచ్చారని తెలిపారు. అలాగే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సీఎం కప్ పేరిట జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించి నైపుణ్యం ఉన్న క్రీడాకారులు వెలుగులోకి వచ్చేలా కృషి చేశారని అభినందించారు. యువత, విద్యార్థులు ఏదో ఒక హాబీ తో ఉండాలని సూచించారు.

అడ్డంగా బుక్కైన సీఐ నాగరాజు

విజయవాడ, జూన్ 26, ఏపీలో సంచలనంగా మారుతోంది సాయి కృష్ణ లాకప్ డెx త్ మిస్టరీ. ఇప్పటికే వైసీపీ నేతలు కుల రాజకీయం మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా, రాజకీయంగా, కుల పరంగా టార్గెట్ చేశారు. అదృశ్యం తరహాలో కేసు విచారణ మొదలుపెట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇందుకు ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజును అదుపులోకి తీసుకుంది. అయితే సాయి కృష్ణ మిస్సింగ్ మిస్టరీ కాస్త లాకప్ డెx త్ గా బయటపడింది. సీఐ రిమాండ్ రిపోర్టులో అత్యా అని తేల్చేసింది సిట్. పోలీస్ కస్టడీలో తగిలిన గాయాల వల్లే సాయి కృష్ణ మరణం సంభవించిందని నిర్ధారించింది. దీంతో కుటుంబ సభ్యుల అనుమానాలు నిజమయ్యాయి. అయితే సాయి కృష్ణ మృతదేహాన్ని ఖననం చేశారా? లేకుంటే ఎక్కడైనా విడిచి పెట్టారా? అన్నది తెలియాల్సి ఉంది.అయితే సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని చంపేశారు అంటూ ఆది నుంచి ఆరోపిస్తున్నారు. కచ్చితంగా ఆనవాళ్లు, అనుమానాలు ఉండడంతో పాటు సంకేతాలు రావడంతోనే ఆమె ఆ తరహా ఆరోపణలు చేశారని ఇప్పుడు అర్థం అవుతోంది. సాయి కృష్ణ మే 6న మార్కాపురంలో టాస్క్ ఫోర్స్ సిబ్బందికి పట్టుబడ్డారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడే నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజు వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు అర్థం అవుతుంది. మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ పూర్తిగా మాయమైంది. అయితే ఇప్పటివరకు అదృశ్యం కేసు గానే ఉండేది. ఇప్పుడు లాకప్ డెx త్ అని తెలియడంతో దాని వెనుక జరిగిన పరిణామాలపై అసలు సిసలైన విచారణ మొదలుకానుంది.అసలు సాయి కృష్ణ పై మోపిన అభియోగాలు ఏంటి? ఏ కేసులో టాస్క్ ఫోర్స్ పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు? సీఐ నాగరాజుకు సరెండర్ చేసిన తర్వాత ఏం జరిగింది? అసలు లాకప్ డెx త్ చేయాల్సిన అవసరం సిఐ నాగరాజుకు ఎందుకు వచ్చింది? దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? లేకుంటే పెద్దల పాత్ర వుందా? ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచకుండా ఎందుకలా చేశారు? అన్నింటికీ మించి సాయి కృష్ణ మృతదేహం ఇప్పుడు ఎక్కడ ఉంది? ఖననం చేశారా? దహనం చేశారా? లేకుంటే ఎక్కడైనా పారవేశారా? అనేది ఇప్పుడు రెండో చార్ట్ షీట్లో తప్పకుండా వెల్లడయ్యే అవకాశం ఉంది. అయితే ఈ కేసు వెనుక ఏం జరిగిందనే దానిపై పోలీసు వర్గాలకు ఇప్పటికే ఒక స్పష్టత ఉంది. ఎందుకంటే మృతుడు సాయి కృష్ణకు నేరచరిత ఉంది. అయితే నేరస్తులంతా లాకప్ డెx త్ చేస్తామంటే కుదరదు. అయితే ఈ స్థాయికి పరిస్థితి వచ్చింది అంటే తెర వెనుక ఏం జరిగింది అనేది ఇప్పుడు కచ్చితంగా బయటపడుతుంది. అంతవరకు వేచి చూడాల్సిందే.

సింగపూర్ కు సముద్రమార్గంలో బంగినపల్లి

విజయవాడ, జూన్ 26, దేశీయ వ్యవసాయ రంగ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఒక కీలక మైలురాయి నమోదయ్యింది. అత్యంత ప్రసిద్ధి చెందిన బంగినపల్లి మామిడి పండ్లను వాణిజ్యపరంగా తొలిసారి సముద్ర మార్గం ద్వారా సింగపూర్‌కు విజయవంతంగా పంపారు. దీంతో తక్కువ ఖర్చు, పర్యావరణ హితంగా తాజా పండ్లను ప్రపంచ మార్కెట్లకు చేర్చేందుకు కొత్త మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మొత్తం ప్రక్రియను వ్యవసాయ, శుద్ధిచేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి పర్యవేక్షించింది. ఇందులో భాగంగా జూన్ 11న ఓసమ్ ఫుడ్ సొల్యూషన్స్ 5 మెట్రిక్ టన్నుల బంగినపల్లి మామిడి పండ్లను ఎగుమతి చేయగా.. ఈ కన్సైన్‌మెంట్ జూన్ 24న సింగపూర్ చేరుకుంది. ఈ ఎగుమతి ప్రక్రియ విజయవంతం కావడం వెనుక లక్నోలోని ఐకార్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సబ్‌ట్రాపికల్ హార్టికల్చర్ కీలక పాత్ర పోషించింది.ఎగుమతి కోసం ఆంధ్రప్రదేశ్‌లోని 'గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' (జీఏపీ) ధ్రువీకరణ పొందిన తోటల నుంచి సేకరించిన మామిడి పండ్లను.. కర్ణాటకలోని అపెడా గుర్తింపు పొందిన ప్యాక్‌హౌస్‌లో శుద్ధి చేసి ప్యాకింగ్ చేశారు. ఈ ఎగుమతి ద్వారా రైతులకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. స్థానిక మార్కెట్‌లో మామిడి కిలో రూ. 25- రూ. 26 పలుకుతోంది. కానీ, సింగ్‌పూర్‌కు ఎగుమతి చేయడం ద్వారా కిలోకు సుమారు రూ. 50 వరకు లభించింది. దీంతో రైతుల ఆదాయం దాదాపు రెట్టింపయ్యింది.అలాగే, ఈ మామిడి పండ్లను దిగుమతి చేసుకున్న సింగూర్ సంస్థ ఈసీ-లింక్స్ లిమిటెడ్.. నాణ్యత అద్భుతంగా ఉందని ప్రశంసించింది. పండ్ల తియ్యదనం, ఒకేరీతిలో పక్వానికి రావడం, ఎక్కువ కాలం నిల్వ ఉండటం వంటి లక్షణాలను ఆ సంస్థ ప్రత్యేకంగా అభినందించింది. సింగపూర్ నిర్దేశించిన నాణ్యత, ఫైటోశానిటరీ ప్రమాణాలను ఈ కన్సైన్‌మెంట్ విజయవంతంగా అందుకోవడం హర్షణీయం. శాస్త్రీయ విధానాల్లో మామిడి కోత, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, సముద్ర రవాణాలో కోల్డ్-చైన్ లాజిస్టిక్స్ సమర్థతను ఇది నిరూపించింది.బంగినపల్లి మామిడి పండు తన బంగారు పసుపు వర్ణం, పీచులేని గుజ్జు, చక్కటి సువాసన, అద్భుతమైన తీపిదనంతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. ఇక, జలమార్గం ద్వారా ఎగుమతి ఖర్చు వాయు మార్గంతో పోలిస్తే తక్కువకావడమే కాదు, పర్యావరణ హితమైందని, వాణిజ్యపరంగా లాభదాయకమైందని రుజువు చేసింది. అలాగే, శక్తిమంతమైన కోల్డ్-చైన్ మౌలిక సౌకర్యాలు, శాస్త్రీయ నిర్వహణ విధానాల సహకారంతో సముద్ర మార్గాల ద్వారా రవాణా భారత ఉద్యానవన ఉత్పత్తుల ఎగుమతులను ప్రపంచవ్యాప్తంగా బలోపేతం చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయ ఎగుమతులను పెంచడం, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం, భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా తగినంత గుర్తింపు తీసుకురావడం అనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అపెడా ఈ చొరవ తీసుకుంది. ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని భారతీయ వ్యవసాయ ఉత్పత్తులను జల మార్గంలో ఎగుమతి చేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

విద్యుత్ వైర్లు కట్ చేస్తున్న గంజాయి బ్యాచ్

గుంటూరు, జూన్ 26 గుంటూరు నగరంలోని ముస్లిం కాలేజ్ ప్రాంతం.. 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో స్థానికుల నుండి వరుస పోన్లు వచ్చాయి. అర్ధరాత్రి సమయంలో పెదకాకాని పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో వరుసగా ఫోన్లు వస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు సిబ్బంది హుటాహుటిన ఆ సబ్ స్టేషన్ పరిధిలో ఎక్కడ సమస్య వచ్చింది చూసి వెంటనే పరిష్కరించారు. ఇదే తరహాలో వారం రోజుల క్రితం రామిరెడ్డి తోట పరిధిలో కూడా అర్ధరాత్రి సమయంలో పవర్ నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇలా వరుసగా జరగటంతో విద్యుత్ శాఖాధికారులు ఆలోచనలో పడ్డారు. అసలు ఏంజరిగి ఉంటుందా అని లైన్లు పరిశీలించారు. వర్షం లేదు, ఈదురు గాలులు లేవు అయినా ఎందుకు అంతరాయం వస్తుందో పరిశీలించిన అధికారులకు ఆశ్చర్యపోయే పరికరాలు కొన్ని కనిపించాయి.పొదవాటి తీగలకు రాళ్లు లేదా ఇతర వస్తువులను కట్టిన గంజాయి బ్యాచ్ లు అర్ధరాత్రి సమయంలో వాటిని విద్యుత్ లైన్ల పైకి విసురుతున్నట్లు గుర్తించారు. ఐరన్ తీగలకు రాళ్లు కట్టి విసరడంతో అవి సులభంగా విద్యుత్ వైర్లపై పడుతున్నాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. విద్యుత్ లైన్ల పై గంజాయి బ్యాచ్ లు ఆ విధంగా విసిరిన ఐరన్ తీగలను గుర్తించిన విద్యుత్ సిబ్బంది వాటిని స్వాధీనం చేసుకున్నారు. వరుసగా ఈ తరహా ఘటనలు జరగడంపై విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఎస్ ఈ చల్లా రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటువంటి ఘటనలతో ఆర్థిక నష్టంతో పాటు ప్రజల భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని.. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రమేష్ తెలిపారు.

భీమిలి నుంచి తేజస్విని

విశాఖపట్టణం జూన్ 26, భీమిలీ నియోజకవర్గం విశాఖలో అతి ముఖ్యమైన సీటు. భీమిలీ స్వీట్ సీట్ అని కూడా అంటారు. టీడీపీకి కంచుకోట భీమిలీ. అత్యధిక సార్లు టీడీపీ అభ్యర్థులే గెలిచారు. ఇక ఇటీవల కాలంలో చూస్తే భీమిలీ ప్రాంతం అంతా మరో జూబ్లీ హిల్స్ గా మారిపోతోంది. అనేక ఐటీ పరిశ్రమలు రిసార్టులు హ్పటెల్స్ వస్తున్నాయి. భీమిలీ నియోజకవర్గంలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ కూడా ఏర్పాటు అయింది. ఇన్ఫోసిస్ సహా కీలకమైన ఐటీ కంపెనీలు వస్తున్నాయి. దాంతో భీమిలీ మీద అందరికీ మోజు అయితే పెరిగిపోతోంది. భీమిలీ నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా ఎవరికి వారుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేసుకుంటున్నారు అని కూటమిలో వినిపిస్తోంది. జనసేన అయితే వచ్చే ఎన్నికల్లో భీమిలీ నుంచి పోటీకి సిద్ధం అని ప్రచారం జరుగుతోంది. మరో వైపు చూస్తే మాజీ మంత్రి భీమిలీ నుంచి రెండు సార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ జనసేనలో చేరి భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా అంటున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా తన రాజకీయ వారసుడిని భీమిలీ నుంచి 2029 ఎన్నికల్లో పోటీకి దించాలని చూస్తున్నారు అని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో సడెన్ గా ఒక గాసిప్ అయితే గట్టిగా వినిపిస్తోంది. అదేంటి అంటే విశాఖ ఎంపీ శ్రీ భరత్ సతీమణి సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య చిన్న కుమార్తె తేజస్విని భీమిలీ నుంచి 2029 ఎన్నికల బరిలో దిగుతుందని ఆ గాసిప్ సారాంశం. ఇది సాధ్యపడుతుందా అంటే ఎందుకు కాదని అనేవారు ఉన్నారు. భరత్ ఎంపీగా ఉన్నారు. ఆయన 2024లో బంపర్ మెజారిటీతో గెలిచారు. వచ్చే ఎన్నికల్లో ఆయన మళ్లీ ఎంపీగా పోటీ చేస్తారు అని అంటున్నారు. దాంతో తన ఎంపీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే భీమిలీ నుంచి సతీమణిని పోటీ చేయించాలని శ్రీ భరత్ అనుకోవడంలో తప్పు లేదని అనే వారూ ఉన్నారు. భీమిలీ నుంచి ఎవరు టీడీపీ నుంచి పోటీ చేసినా గ్యారంటీగా విక్టరీ ఉంటుందని అంతా చెబుతారు. అదే నిజం కూడా. ఇక ఏకంగా బాలయ్య కుమార్తె పోటీ చేయాలనుకుంటే భీమిలీ సీటు టీడీపీ వశం అని కళ్ళు మూసుకునే చెప్పాల్సి ఉంటుందని అంటున్నారు. ఇంతకీ తేజస్వినికి రాజకీయాల మీద ఇంట్రెస్ట్ ఉందా లేదా అన్నది చూడాల్సి ఉందని అంటున్నారు. ఇక్కడ కొసమెరుపు ఏంటి అంటే 1994 ఎన్నికల సందర్భంగా అన్న నందమూరి తారక రామారావు భీమిలీ నుంచి పోటీ చేయాలని అనుకున్నారని ప్రచారంలో ఉంది. చివరి నిముషంలో ఆయన టెక్కలికి వెళ్ళారు. ఇక 2019 ఎన్నికల సమయంలో నారా లోకేష్ భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని కూడా వార్తలు వచ్చాయి. మరి ఇపుడు ఈ గాసిప్ వస్తోంది. అది కూడా ఎన్నికలకు మూడేళ్ళ ముందు. మరి ఇది ఒట్టి పుకార్ నా లేక నిజమెంత అంటే కాలమే దీనిని జవాబు చెప్పాల్సి ఉంది అని అంటున్నారు

టీడీపీలో తమ్ముళ్లు తగాదాలు

నెల్లూరు, జూన్ 26, నెల్లూరు జిల్లా ఉదయగిరి టిడిపిలో ఇంటర్నల్‌గా రీ సౌండ్స్ వస్తున్నాయట. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం రీ యూనియన్ అవుతున్నట్టు తెలుస్తోంది. పాత తరం పార్టీ నేతలకు, ఎమ్మెల్యేకి మధ్య బాగా గ్యాప్ పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. వరుస భూ వివాదాలు కాకర్ల మెడకు చుట్టుకుంటున్నాయట. అనుచరులు చేసే తప్పులకు కోర్టు మెట్లు ఎక్కాల్సి రావడం ఎమ్మెల్యేకి తలనొప్పిగా మారుతోందంటున్నారు. ఆయన వ్యవహార శైలి నచ్చని పాత తరం టిడిపి నేతలందరూ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకి టచ్‌లోకి వెళ్తున్నట్టు తెలుస్తోంది. మండలాల్లో తమకేం పనులు జరగడంలేదని.. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం ఎమ్మెల్యే మనుషులు చెప్పినట్టే పనిచేస్తున్నారంటూ సీనియర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. 2024 ఎన్నికలకు ముందు ఉదయగిరి నియోజకవర్గ ఇన్చార్జిగా బొల్లినేని రామారావు ఉన్నారు. అయితే ఫైనల్‌గా ఆయన్ని కాదని టీడీపీ అధిష్టానం ఎన్నారై కాకర్ల సురేష్‌కు మొదటి లిస్ట్‌లోనే అవకాశం కల్పించింది. అప్పటి వరకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేసిన సురేష్.. అన్ని వర్గాలను కలుపుకొని జనంలోకి వెళ్ళి ఫస్ట్ అటెంప్ట్‌లోనే విజయం సాధించారు. కానీ? గెలిచాక వైఖరి మారిందన్నది స్థానికంగా వినిపిస్తున్న మాట. వరుస వివాదాలు చుట్టు ముడుతుండగా? అటు బొల్లినేని వర్గాన్ని సైతం దూరం పెట్టేశారన్నది కేడర్ చెబుతున్న మాట. తన వర్గాన్ని దూరం పెట్టినా? బొల్లినేని రామారావు పెద్దగా రియాక్ట్ అవకుండా, నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టకుండా.. నెలకోసారి తన వాళ్ళని కలుస్తున్నారు.ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ చర్చ ఉదయగిరి నియోజకవర్గంలో జరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఒక వివాహానికి మాజీ ఎమ్మెల్యే వెళ్ళగా.. అదే పెళ్ళికి ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పాతతరం టీడీపీ నేతలు, పలువురు మండలాధ్యక్షులు హాజరయ్యారు. వాళ్ళంతా కలిసి అప్పుడు ఎమ్మెల్యే మీదున్న అసంతృప్తిని బొల్లినేని దగ్గర వెళ్ళగక్కినట్టు తెలిసింది. కాకర్ల తమను పట్టించుకోవడంలేదని, ఒక సిఐ తో పాటు పలువురు అధికారులను మార్చాలని కోరినా.. చేద్దాం చూద్దామనే మాటలే తప్ప పని జరగడం లేదని వాపోయారట. పోలీస్ స్టేషన్లతో పాటు మండల కార్యాలయాల్లో కూడా తమకు పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. అలాగే?. ప్రజలకు, ఎమ్మెల్యేకి మధ్య గ్యాప్ పెరిగిపోవడం వల్లే.. పార్టీకి మైలేజ్ రావడం లేదని అంతర్గతంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. వింజమూరు, ఉదయగిరి, దుత్తలూరు, కలిగిరిలో ఎమ్మెల్యే పేరు చెప్పుకొని గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోందని, పార్టీకీ అది పెద్ద డ్యామేజ్ అంటూ చెప్పుకొచ్చారట. ఓ సీఐ వ్యవహార శైలి కూడా ఎమ్మెల్యే కాకర్ల కు చెడ్డ పేరు తీసుకొచ్చేలా ఉందన్నది సీనియర్స్ వాయిస్. నక్కలగండి రిజర్వాయర్ లో ఉండే మత్స్య సంపదను ప్రైవేట్ వ్యక్తులు కాజేస్తుంటే ఎమ్మెల్యే కనీసం పట్టించుకోలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఓ పోలీస్ అధికారి పర్యవేక్షణలో ఈ చేపల దందా సాగుతోందట. ఈ వ్యవహారం ఎమ్మెల్యే కి తెలుసా లేదా అనే అనుమానాలను స్థానిక టీడీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.ఇప్పుడసలు నియోజకవర్గంలో ప్రతిపక్షం బలంగా ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్న చర్చ కూడా నేతల మధ్య జరిగిందట. ఈ పరిస్థితుల్లో ఉదయగిరి నియోజకవర్గంలో మళ్లీ యాక్టివ్ అవ్వాలని బొల్లినేని రామారావును పాత తరం టీడీపీ నేతలు కోరినట్టు తెలిసింది. ప్రస్తుతం పార్టీ సెంట్రల్ ఆఫీసులోని గ్రీవెన్స్ సెల్‌లో జాతీయ ఉపాధ్యక్షుడి హోదాలో పని చేస్తున్నారు బొల్లినేని రామారావు. ఇక నుంచి ఉదయగిరి నియోజకవర్గ రాజకీయాలపై కూడా దృష్టి పెట్టాలని కోరారట స్థానిక నేతలు. మరోవైపు ఎమ్మెల్యే కాకర్ల సురేష్? ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో సన్నిహితంగా ఉండే వాళ్ళని కూడా దూరం పెడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఇవన్నీ జిల్లా అధ్యక్షులకు చెప్పలేక, దూరం పెడుతున్న ఎమ్మెల్యేకి దగ్గర అవ్వలేక కొందరు టీడీపీ సీనియర్స్ సతమతమవుతున్నారట. గతంలో ఎమ్మెల్యేకి దగ్గరగా ఉన్న ఒకరిద్దరు నేతలు కూడా ఇప్పుడు బొల్లినేనికి టచ్‌లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

సీఎం చంద్రబాబు హెచ్చరికల తర్వాత ఎమ్మెల్యేలో మార్పు వస్తుందని అందరూ భావించారని, కానీ ప్రస్తుతం అలాంటిదేమీ కనిపించడం లేదని సొంత నేతలే చెబుతున్నారు. వైసీపీ నుంచి వచ్చిన ఒకరిద్దరు నేతలకి ప్రాధాన్యం ఇస్తున్నారని.. తమను పట్టించుకోవడంలేదని పాత తరం నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా రాబోయే రోజుల్లో మెట్ట ప్రాంత నియోజకవర్గ రాజకీయం రసకందాయంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయన్నది విశ్లేషకుల అభిప్రాయం.

శత్రువులుగా మిత్రపార్టీలు

ఏలూరు, జూన్ 26 కాపు కులం కేంద్రంగా రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణాలు ఆయన్ని ఇరకాటంలో పడేస్తున్నాయంటున్నారు. ఇటీవల వైసీపీ కాపు నేతలంతా కలిసి మీటింగ్ పెట్టుకున్నాక జరుగుతున్న పరిణామాల మీద, పార్టీ తరపున కౌంటర్స్ వేసేందుకు ముందుండమని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేని ఆదేశించిందట జనసేన అధిష్టానం. అందుకు తగ్గట్టే ప్రత్యర్థుల్ని అదీకూడా సొంత సామాజికవర్గానికి చెందిన వాళ్ళని గట్టిగానే టార్గెట్ చేస్తున్నారు బొలిశెట్టి శ్రీనివాస్. అలాగే? ఆయన ఏం మాట్లాడినా వెంటనే వైసీపీ కాపు నేతల వైపునుంచి రివర్స్ పంచ్‌లు కూడా స్ట్రాంగ్‌గా పడుతున్నాయి. దీంతో బొలిశెట్టి బాగా ఫీలవుతున్నట్టు తెలుస్తోంది.రాష్ట్రంలో చాలామంది జనసేన నాయకులు ఉన్నప్పటికీ? ప్రతిపక్ష నేతల్ని, ప్రత్యేకించి కాపు సామాజిక వర్గ నేతలను ఎదుర్కోవడం ఓ రకంగా ఇబ్బందికరమేనని భావిస్తున్నారట. దీంతో ఎమ్మెల్యే అయ్యానన్న ఆనందంకంటే ఇదెక్కడి పొలిటికల్ కులగోల అన్న అసహనమే పెరిగిపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. మరోవైపు సొంత నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలు ఆయనతో కలిసి పని చేయడానికి ముందుకు రాకపోగా ఇమేజ్‌ని డామేజ్ చేయడానికి చేస్తున్నారట. అందుకే శత్రువులుగా మారిన మిత్ర పార్టీ నేతలతో పోరాడడానికే రెండేళ్లు సరిపోయిందంటూ ఏ వేదికల మీద బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారాయన. కలిసి పని చేయండని రెండు పార్టీల అధిష్టానాలు ఆదేశిస్తున్నాతాడేపల్లిగూడెంలో తెలుగుదేశం నాయకులు మాత్రం జనసేనతో కలిసి ముందుకెళ్లేందుకు ససేమిరా అంటున్నారన్నది ఎమ్మెల్యే మాట. పైగా ఎమ్మెల్యే ఎంతో మేమూ అంతేనన్నట్టుగా టిడిపి ఇన్చార్జ్ వలవల బాబ్జీ వ్యవహరిస్తున్నారన్నది బొలిశెట్టి వర్గం కంప్లయింట్. ఇలాంటి సమయంలో వైసీపీని ఏకిపారేయాల్సి రావడం అదనపు తలనొప్పిగా మారిందన్నది ఆయన సన్నిహితుల మాట. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మాటల తూటాలు సరిగ్గా టార్గెట్ చేరితే సరే.. ఎక్కడైనా రివర్స్ అయిందంటే అసలుకే ఎసరు వచ్చి సొంత కులం వాళ్ళకే తాను టార్గెట్ అవుతానన్న భయం కూడా బొలిశెట్టిని వెంటాడుతోందట.దాంతో అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూనే.. కాపు కులానికి చెందిన ప్రత్యర్థుల విషయంలో ఆచితూచి అడుగులు వేయాల్సి వస్తోందని, ఫైనల్‌గా అందరి టార్గెట్ నేనే అవుతానా అన్న అనుమానం సైతం ఆయన్ని వెంటాడుతోందట. మిత్ర పార్టీ నేతలతో ఇంట గెలిచేందుకు ఇప్పటికే నానా తంటాలు పడుతుంటే.. ఇప్పుడు రచ్చ గెలవాల్సిన అనివార్యత ఎదురవుతోంది. ఇదే విషయాన్ని చెబుతూ?. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తనను బాహుబలి అని ఎందుకు పిలిచారో ఇప్పుడు అర్థమవుతోందని సన్నిహితుల దగ్గర సెటైర్లు సైతం వేస్తున్నారట ఎమ్మెల్యే. రోజు రోజుకి కాక పెంచుతున్న జనసేన వర్సెస్ వైసీపీ రాజకీయం ఒకవైపు, తాడేపల్లిగూడెంలో టిడిపి వర్సెస్ జనసేన ఫైట్‌లో ఎవరు కట్టప్పలవుతారో అర్థం కాని అయోమయం మరోవైపు కలగలిసి తీవ్ర గందరగోళంలో ఉన్నారట శ్రీనివాస్. దీంతో కూటమిలోని ఇబ్బందులేంటో తన దాకా వస్తేగానీ? ఎమ్మెల్యేకి తెలియడం లేదా? ఇప్పటికైనా మా బాధలేంటో అర్థం చేసుకోండని కింది స్థాయి నాయకులు సూటిపోటి మాటలు అంటున్నారట. అలా మొత్తం మీద మా ఎమ్మెల్యే గట్టిగానే ఇరుక్కున్నారన్నది తాడేపల్లిగూడెం టాక్.

రెండు బైకులు ఢీ.. ఇద్దరు మృతి

హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 07:25 గంటలకు, ఏఎంబీ ఫ్లైఓవర్పై రోడ్డు ప్రమాదం జరిగింది.

గచ్చిబౌలి నుండి హఫీజ్పేట్ వైపు వెళ్తున్న రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్సైకిల్ హఫీజ్పేట్ నుండి గచ్చిబౌలి వైపు రోడ్ రాంగ్ రూట్ లో ప్రయాణిస్తున్న స్కూటీని ఎదురుగా ఢీకొట్టింది. స్కూటీ నడుపుతున్న శ్రీకాంత్, వెనుక కూర్చున్న విట్టల్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మరణించారు. రాయల్ ఎన్ఫీల్డ్ రైడర్ వినోద్కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం మేరకు సమీపంలో ఉన్న హాస్పిటల్ తరలించారు కేసు నమోదు చేసుకొని పూర్తి వివరాలు సేకరిస్తున్నమని తెలిపారు

కూరగాయల మార్కెట్ లో అగ్నిప్రమాదం

కోనసీమ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అగ్నిప్రమాదం జరిగింది. రామచంద్రపురం మండలం ద్రాక్షారామ కూరగాయల మార్కెట్లో అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో 30 వరకు షాపులు దగ్ధం అయింది. దుకాణాల్లోని కూరగాయలు, సరుకులు అగ్నికి ఆహుతి అయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమని స్థానికులు భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు.

ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్

విజయవాడ, జూన్ 26, ఆంధ్రప్రదేశ్ బ్యూరోక్రసీలో వివాదాస్పద అధికారిణిగా గుర్తింపు పొందిన 1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్ లో ఉన్న ఆమెను.. హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని, కేవలం మానవతా దృక్పథంతో ఆమెకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే పచ్చి నిజం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారిక నిబంధనల ప్రకారం.. వై. శ్రీలక్ష్మి ఈ జూన్ 30వ తేదీతో తన సుదీర్ఘ ఐఏఎస్ సర్వీసు నుండి రిటైర్ కానున్నారు. అంటే ఆమె పదవీ కాలం ముగియడానికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఒకవేళ ఎలాంటి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లోనో లేదా లూప్ లైన్ పరిధిలోనే రిటైర్ అయితే, ఆ ప్రభావం ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై, పెన్షన్ నిబంధనలపై పడే అవకాశం ఉంది. ఒక సీనియర్ మహిళా అధికారిణిగా ఆమె సుదీర్ఘ కెరీర్ ముగింపు దశలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, సర్వీసులో ఉంటూ గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెరీర్ ప్రారంభించిన వై. శ్రీలక్ష్మి.. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక.. ఏపీకి వచ్చేందుకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. క్యాట్ ఆదేశాల ద్వారా తెలంగాణ నుండి ఏపీ కేడర్‌లోకి బదిలీ చేయించుకున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆమెకు విపరీతమైన ప్రాధాన్యత దక్కింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆమె సచివాలయంలో చక్రం తిప్పారు. జగన్ హయాంలోనే ఆమెకు వరుస ప్రమోషన్లు లభించి బ్యూరోక్రసీలో టాప్ పొజిషన్‌కు చేరుకున్నారు. ఐఏఎస్ వై. శ్రీలక్ష్మి సుదీర్ఘ కెరీర్ ఎంత వైభవంగా సాగిందో.. దానికి రెట్టింపు స్థాయిలో పెను వివాదాలు, లీగల్ ఇబ్బందులు ఆమెను చుట్టుముట్టాయి.

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ కేసులో ఆమె తీవ్ర చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాటి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా గాలి జనార్దన్ రెడ్డికి అనుకూలంగా జీవోలు ఇచ్చారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను అరెస్ట్ చేసింది. ఈ కేసుల వల్ల ఆమె ఐఏఎస్ సర్వీసు నుండి సస్పెండ్ అవ్వడమే కాకుండా, చంచల్‌గూడ జైల్లో సుదీర్ఘ కాలం రిమాండ్ ఖైదీగా జైలు శిక్షను కూడా అనుభవించాల్సి వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో సైతం ఆమె పేరు ప్రముఖంగా వినపడింది. ఆమెపై ఇప్పటికీ పలు కోర్టు కేసులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు నడుస్తున్నప్పటికీ.. వాటన్నింటినీ పక్కనబెట్టి, రిటైర్మెంట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు ప్రభుత్వం ఆమె సీనియారిటీని గౌరవించింది. సచివాలయంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అధికారుల బదిలీలను చూసే జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించడం ద్వారా ఆమె ఐఏఎస్ కెరీర్‌కు ఒక సాఫీ ముగింపును ఇచ్చే ప్రయత్నం చంద్రబాబు సర్కార్ చేసింది.

ఇక్కడ ఫ్లై ఓవర్లు... అక్కడ ఎయిర్ పోర్టులు

హైదరాబాద్ జూన్ 26, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి 12 ఏళ్లు గడిచింది. ఒకే రాష్ట్ర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయాయి. విభజన తర్వాత తెలంగాణలో కరెంటు ఉండదని, నక్సలిజం పెరుగుతుందని అప్పట్లో కొందరు నేతలు వ్యాఖ్యానించారు. మరో బిహార్ అవుతుందని హెచ్చరించారు. అయితే ఇందుకు విరుద్ధంగా రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి వేగం పుంజుకుంది. వేర్వేరు ప్రాధాన్యతలతో అభివృద్ధి పనులు చేపట్టాయి. ఒక్కొక్క రాష్ట్రం తన ప్రధాన సమస్యలను దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాలను నిర్మించుకుంది. ఇది రెండు రాష్ట్రాల మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని సృష్టించింది.

హైదరాబాద్‌లో ఫ్లై ఓవర్లు?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినత ర్వాత అధికారం చేపట్టిన కేసీఆర్ హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంపై ఎక్కువ దృష్టి పెట్టారు. రాష్ట్ర విభజన తర్వాత దాదాపు ఒక దశాబ్దంలో హైదరాబాద్‌లోనే 35కిపైగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, సబ్‌వేలు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచింది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, రోడ్ల విస్తరణ, చెరువుల సుందరీకరణ వంటి పనులు కూడా చేపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఈ క్రమాన్ని కొనసాగిస్తూ మరిన్ని ఫ్లై ఓవర్లను ప్రారంభించింది.

ఆంధ్రప్రదేశ్‌లో విమానాశ్రయాలు..

ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర విభజన తర్వాత విమానాశ్రయాల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారించింది. కర్నూల్, కడప, భోగాపురం వద్ద కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాలు ఏర్పాటు చేయడం, అమరావతిలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం,గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలకు సన్నాహాలు చేయడం ద్వారా రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచాలని ప్రయత్నిస్తోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికులకు త్వరలో అందుబాటులోకి రానుంది.

ఏపీలో నగరాభివృద్ధి లోపం..

ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రధాన నగరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణం చాలా తక్కువగా ఉంది. మెట్రో ప్రాజెక్టులతో ఫ్లై ఓవర్లను ముడిపెట్టే ప్రతిపాదనలు కేంద్రం నుంచి ఆమోదం పొందలేకపోవడం ఒక కారణం. రాజధాని అమరావతి నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టడం వల్ల మిగిలిన జిల్లాలు, నగరాల్లో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ పనులు వెనకబడ్డాయి. అలాగే నగరాల్లో పచ్చదనం పెంచడంలో కూడా తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉంది.

రెండు రాష్ట్రాల ప్రాధాన్యతలు

తెలంగాణ ప్రభుత్వం పట్టణీకరణ వల్ల ఏర్పడిన ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించ డానికి ఫ్లై ఓవర్లు, రోడ్ల అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకుంది. అయితే కొత్త విమానాశ్రయాలఏర్పాటులో వెనుకబడింది. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఆమోదం వచ్చినా నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. ఆంధ్రప్రదేశ్ మాత్రం రాష్ట్ర విభజన తర్వాత కనెక్టివిటీ, ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని విమానాశ్రయాలు, హైవేల నిర్మాణంపై ఎక్కువ దృష్టి పెట్టింది. కానీ నగరాల్లో ట్రాఫిక్ సౌకర్యాలు, ఫ్లై ఓవర్ల నిర్మాణంలో ఇంకా చాలా దూరం వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం తెలంగాణకు కొత్త విమానాశ్రయాలు అవసరం ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు నగరాల్లో ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ, పచ్చదనం పెంచడం అత్యవసరం. రెండు రాష్ట్రాలు తమ బలహీనతలను గుర్తించి, ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటూ సమతుల్య అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉంది.

తెలుగు ఎంపీలే రిచ్చెస్ట్

హైదరాబాద్ జూన్ 26, అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాజ్యసభ సభ్యుల ఆస్తుల విలువలో తెలుగు రాష్ట్రాల ఎంపీలదే పైచేయిగా నిలిచింది. దేశవ్యాప్తంగా 226 మంది సిట్టింగ్ ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ. 26,047 కోట్లు కాగా.. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 18 మంది ఎంపీల సంపదే 39.39 శాతం అంటే రూ. 10,259 కోట్లు ఉండటం గమనార్హం. ముఖ్యంగా తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల ఆస్తులు రూ. 8,310 కోట్లుగా ఉన్నాయి. బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రూ. 5300 కోట్లతో దేశంలోనే అత్యంత ధనిక ఎంపీగా నిలిచారు. అలాగే తెలంగాణ ఎంపీల్లో 71 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. భారత పార్లమెంట్ ఎగువసభ అయిన రాజ్యసభలో తెలంగాణ ప్రజాప్రతినిధుల హవా నడుస్తోంది.

అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ దేశవ్యాప్తంగా ఉన్న 226 మంది సిట్టింగ్ రాజ్యసభ ఎంపీల ఆర్థిక, నేర, ఇతర నేపథ్యాలపై తాజాగా విడుదల చేసిన నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం రాజ్యసభ సభ్యుల ఆస్తులతో పోలిస్తే.. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 18 మంది ఎంపీల వాటాయే ఏకంగా 39.39 శాతంగా నమోదైంది. ఈ మొత్తం సంపదలోనూ ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణ ఎంపీల ఆస్తులే ఎక్కువ. మొత్తం 226 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ. 26,047 కోట్లు కాగా.. అందులో కేవలం తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల సంపదే ఏకంగా రూ. 8,310 కోట్లుగా ఉంది. అంటే దేశవ్యాప్త ఎంపీల మొత్తం ఆస్తిలో దాదాపు మూడో వంతు వాటా తెలంగాణ ప్రజాప్రతినిధులదే కావడం గమనార్హం. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 11 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ. 1,949 కోట్లుగా ఉంది. నివేదిక ప్రకారం తెలంగాణలో 57 శాతం మంది, ఆంధ్రప్రదేశ్‌లో 45 శాతం మంది ఎంపీలు బిలియనీర్లుగా తేలారురాజ్యసభలో అత్యధిక ఆస్తులున్న తొలి ముగ్గురు ఎంపీలను పరిశీలిస్తే.. అందులో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే కావడం విశేషం. తెలంగాణ నుంచి బీఆర్ఎస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న బండి పార్థసారథి రూ. 5,300 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక రాజ్యసభ ఎంపీగా మొదటి స్థానంలో నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజేందర్ గుప్తా రూ. 5,053 కోట్లతో రెండో స్థానంలో నిలవగా.. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ రూ. 2,558 కోట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. తెలంగాణలో కేవలం ముగ్గురు బీఆర్ఎస్ సభ్యుల ఆస్తి విలువే రూ. 5,524 కోట్లుగా ఉందని ఏడీఆర్ స్పష్టం చేసింది. క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీల జాబితాలోనూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. తెలంగాణకు చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో ఐదుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో ముగ్గురిపై అత్యంత తీవ్రమైన నేరాల కేసులు ఉన్నట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది. ఈ కేసుల పరంగా దేశంలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బిహార్, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల కంటే తెలంగాణే ముందంజలో ఉంది. తెలంగాణలో క్రిమినల్ కేసులున్న వారిలో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎంపీలు ఉన్నారు. దేశవ్యాప్తంగా వంద కోట్ల కంటే ఎక్కువ ఆస్తి ఉన్న ఎంపీలు 31 మంది ఉండగా.. అందులో బీజేపీ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఆరుగురు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్ నుంచి ఇద్దరేసి, జనసేన నుంచి ఒకరు ఈ వంద కోట్ల క్లబ్‌లో ఉన్నారు. పార్టీల పరంగా చూస్తే.. దేశవ్యాప్తంగా బీజేపీ ఎంపీల ఆస్తుల విలువ రూ. 8,181 కోట్లు కాగా.. కాంగ్రెస్ సభ్యులది రూ. 3,781 కోట్లుగా ఉంది.

నలుగురు స్వతంత్రులకు రూ. 2,211 కోట్ల ఆస్తులున్నాయి. ఏపీలో టీడీపీకి చెందిన నలుగురు ఎంపీల ఆస్తుల విలువ రూ. 1,007 కోట్లు కాగా.. వైసీపీకి చెందిన నలుగురు సభ్యులకు రూ. 683 కోట్ల విలువైన ఆస్తులున్నాయి. అప్పుల విషయానికి వస్తే.. రాజ్యసభలో అత్యధిక అప్పులున్న తొలి ముగ్గురు ఎంపీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ ఎంపీ భాష్యం రామకృష్ణ రూ. 200 కోట్ల అప్పులతో రెండో స్థానంలో నిలిచారు. ఆయన మె?త్తం ఆస్తులు రూ. 672 కోట్లు. ఝార్ఖండ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పరిమళ్‌నత్వానీ రూ. 256 కోట్ల అప్పులతో మొదటి స్థానంలో.. జయాబచ్చన్ రూ. 149 కోట్ల అప్పులతో మూడో స్థానంలో ఉన్నారు. కాగా, మొత్తం రాజ్యసభ సభ్యుల్లో మహిళల వాటా కేవలం 15 శాతం అంటే 34 మంది మాత్రమే ఉన్నారని.. అందులోనూ బీజేపీ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి నలుగురు ఉన్నట్లు ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది.

వరంగల్ లో ఇసుక దుమారం

వరంగల్ జూన్ 26, వరంగల్ జిల్లా పాలిటిక్స్‌లో ఇప్పుడు ఇసుక దుమారం రేగుతోంది. ఇసుక దందాతో ఇద్దరు మంత్రులు వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపిస్తూ అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నంలో ఉంది బీఆర్ఎస్. ములుగు జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా ఇసుక దోపిడీ జరుగుతోందని విపక్షం చేస్తున్న ఆరోపణలు పొలిటికల్ మంటలు పుట్టిస్తున్నాయి. దోపిడీకి సంబంధించి మా దగ్గర డ్రోన్ విజువల్స్, ఇతర ఆధారాలు ఉన్నాయంటూరోజుకో ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేస్తున్నారు గులాబీ నేతలు. అలాగే? దీనికి సంబంధించి సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సందర్భంలో దీనికి కౌంటర్ ఇవ్వడంలో జిల్లా కాంగ్రెస్ నేతలు విఫలమవుతున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ఇద్దరు మంత్రులు అంటూ? బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై కేవలం ములుగు జిల్లా పార్టీ నేతలు మినహా? కాస్తంత హోదా ఉన్న, పెద్ద నాయకులు ఎవరూ ఎందుకు రియాక్ట్ అవడం లేదన్న చర్చలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. రాష్ట్ర మంత్రులు ఇద్దరు కలిసి ములుగు జిల్లా పరిధిలోని గోదావరి ఇసుకను మింగేస్తున్నారంటూ డైరెక్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీతమ్మ సాగర్‌లో అక్రమంగా ఇసుక తవ్వి దాదాపు 4 వేల కోట్ల రూపాయలు వెనకేసుకునేందుకు మంత్రులు ఇద్దరూ ప్రయత్నిస్తున్నారన్నది కేటీఆర్ ఆరోపణ. ఇసుక మాఫియా సూత్రధారులను బయటకు లాగాలన్నది ఆయన డిమాండ్. దీనికి సంబంధించి ములుగు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు గులాబీ నేతలు. ఇలా ఇసుక దోపిడీ పేరుతో అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా బీఆర్ఎస్ నేతలు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నా. అధికార పక్షం నుంచి గట్టిగా తిప్పికొట్టే ప్రయత్నం మాత్రం జరగడంలేదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం ములుగు నాయకులు, అందునా ఒక మంత్రి అనుచరగణం తప్ప? ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏ ముఖ్య నేతా ఎందుకు స్పందించలేదన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఆ విషయంలో కాంగ్రెస్ వాళ్ళు ఎందుకు వెనకడుగు వేస్తున్నారంటూ ఎవరికి వారు రకరకాల విశ్లేషణల్లో మునిగిపోయారు. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు అశోక్, జిల్లా పార్టీలోని కొందరు నాయకులు మాత్రమే బీఆర్ఎస్ ఆరోపణలకు రియాక్ట్ అయి నిరూపించమంటూ సవాల్ విసిరారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యేల సంగతి తర్వాత? కనీసం ఉమ్మడి వరంగల్ పరిధిలో ఇప్పుడున్న మిగిలిన ఐదు జిల్లాల డీసీసీ అధ్యక్షులు కూడా మినిస్టర్స్ మీద వస్తున్న ఇసుక ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదన్నది ఆలోచించాల్సిన విషయమేనని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతుల విషయంలో ఎక్కడా తప్పు జరగలేదని, మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా వ్యవహరించలేదని కాంగ్రెస్ నేతలు గట్టిగా ఎందుకు చెప్పలేకపోతున్నారన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. ఇందుకు సమాధానంగా వినిపిస్తున్న కొన్ని మాటలు కాంగ్రెస్ పార్టీలోని ప్రస్తుత పరిస్థితి ప్రతిబింబిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న భయంతోనే ఎక్కువ మంది కామ్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. చేతిలో పూర్తి సమాచారం లేకుండా. ఏదో, మంత్రుల్ని వెనకేసుకుని రావాలి కాబట్టి నోటికొచ్చింది మాట్లాడేస్తే రేపు మనం ఇరుక్కుపోతామన్న భయం వాళ్ళలో ఉందట. అందుకే ఇసుక ఆరోపణల విషయంలో మంత్రులు ఇద్దరికీ బాసటగా నిలవలేకపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మంత్రుల నుంచి కూడా మనం కరెక్ట్‌గానే ఉన్నాం, మీరు ఖండించండన్న గ్రీన్ సిగ్నల్ కూడా రాలేదని అంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్టానం సైతం ఈ విషయంపై నేతలకు క్లారిటీ ఇవ్వకపోవడం వల్ల ఇసుక దందా అంశాన్ని పట్టించుకోకుండా ఎవరికి వారు తమ పని తాము చేసుకుంటూ వెళ్తున్నారట. కానీ? విపక్షం ఆరోపణలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళక ముందే మేలుకుని ప్యాచ్‌వర్క్ చేయకుంటే నష్టపోవాల్సిన పరిస్థితులు వస్తాయన్న టెన్షన్ కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది.

అంత్యోదయ పథకంలో మార్పులు

వరంగల్ జూన్ 26, దేశంలోని అత్యంత నిరుపేద కుటుంబాల ఆహార భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ అన్న యోజన పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి 35 కిలోల బియ్యం లేదా గోధుమలను అందిస్తున్నారు. తాజాగా, ఈ పథకంలో మార్పులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇకపై పేద కుటుంబాల్లోని సభ్యుల సంఖ్యను బట్టి రేషన్ పంపిణీ చేయనున్నారు. ఈ కార్డు ఉన్నవారికి ఒక్కొక్కరికీ 7 కిలోలు చొప్పున ఇద్దరు ఉంటే 14 కిలోల ఇస్తారు. ఐదుగురు, ఆపై ఎక్కువ ఉంటే ప్రస్తుతం ఇచ్చే 35 కిలోలు కొనసాగుతాయి. అంత్యోదయ అన్న యోజన పథకంలో కేంద్రం కీలక మార్పులు తీసుకురానుంది. ఈ పథకం కింద లబ్దిదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఒక్కొక్కరికీ 7 కిలోల ఆహారధాన్యాలు అందజేసేలా మార్పులు చేయబోతోంది. ప్రస్తుతం ఉన్న 35 కిలోల గరిష్ఠ పరిమితిని యథాతథంగా కొనసాగించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి జాతీయ ఆహార భద్రత చట్టం 2013ను సవరించేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన సవరణ బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణకు నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ.. జులై 13 వరకు గడువు విధించింది. ప్రస్తుతం అత్యంత నిరుపేద కుటుంబాలకు అంత్యోదయ అన్న యోజన పథకం కింద సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా 35 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా ఇస్తున్నారు. అదే, సాధారణ రేషన్‌కార్డుదారులకు ఒక్కో వ్యక్తికి నెలకు 5 కిలోల చొప్పున అందిస్తున్నారు. కానీ, మార్పుల తర్వాత అంత్యోదయ కార్డుదారులు కుటుంబంలో ఇద్దరే ఉంటే వారికి 14 కిలోలు ఆహారధాన్యాలు మాత్రమే లభిస్తాయి. ఐదుగురు లేదా అంతకు మించి ఉన్నా 35 కిలోలు పంపిణీ చేస్తారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ తగిన పరిమాణంలో ఆహారధాన్యాలను అందజేయడమే ఈ సవరణ ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుత విధానం వల్ల ఎక్కువ మంది అంత్యోదయ అన్న యోజన కుటుంబాలు, సాధారణ రేషన్‌కార్డు కేటగిరీ కంటే తలసరి తక్కువ రేషన్‌ను పొందుతున్నాయి.

ఢిల్లీలో తెలంగాణకు స్థలం కరువు

హైదరాబాద్, జూన్ 26, దేశ రాజధానిలో తెలంగాణకు కేరాఫ్ లేకుండా పోతోందా? ప్రస్తుతం ఏపీ మంచితనం మీద ఆధారపడాల్సి వస్తోందా? వాళ్ళు ఎప్పుడు ఖాళీ చేయమంటారోనని తెలంగాణ అధికారులు కంగారు పడుతున్నారా? ఏ విషయంలో అంత టెన్షన్ పడుతున్నారు? రాష్ట్ర విభజన జరిగిన 12 ఏళ్ళ తర్వాత కూడా ఆ సమస్యలు ఎందుకు వస్తున్నాయి? ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకకు నిర్మాణానికి అడ్డుపడుతున్నదేంటి? ఢిల్లీలో తెలుగోళ్ళకు కేరాఫ్ ఆంధ్ర భవన్. సెంట్రల్ ఢిల్లీలో అదీ, ఇండియా గేట్‌కు అత్యంత దగ్గరగా ఉన్న ఈ బిల్డింగ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఓ వెలుగు వెలిగింది. అయితే విభజన తర్వాత ఆస్తుల పంపకాల్లో భాగంగా ఆంధ్ర భవన్ ను తాత్కాలికంగా విడగొట్టుకుని ఒకే బిల్డింగ్‌లో రెండు రాష్ట్రాలు అడ్మినిస్ట్రేషన్‌ను కొనసాగిస్తున్నాయి. అందుకే ప్రస్తుతం ఢిల్లీలోని ఈ భవన్‌ను చూస్తే గమ్మత్తుగా కనిపిస్తోందని అంటుంటారు చాలామంది. దీనికి ఒకవైపు ఆంధ్ర , మరో వైపు తెలంగాణ అని పక్క పక్కనే బోర్డ్స్ కనిపిస్తూ ఉంటాయి. పైగా రెండు రాష్ట్రాల ఢిల్లీ భవన్స్ ఒకే బిల్డింగ్‌లో ఉండడంతో వాళ్ళని వీళ్లు, వీళ్లని వాళ్ళు? మెయింటెనెన్స్‌ను పూర్తిగా గాలికొదిలేశారు. దాంతో ఘనంగా చెప్పుకోవాల్సిన ఆంధ్ర, తెలంగాణ భవన్లు ప్రస్తుతం గందరగోళంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో సెక్రటేరియెట్‌కు ఎంతటి ప్రాముఖ్యత ఉంటుందో, ఢిల్లీలో ఉండే రాష్ట్రాల భవన్లకు అంత ఇంపార్టెన్స్ ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా? ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్లు, ప్రోటో కాల్ అధికారులు ఉంటారు. ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం ఢిల్లీ ట్రిప్‌కు వచ్చినప్పుడు భవన్లోనే బస చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో?. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక, భవన్ విభజనపై క్లారిటీ వచ్చింది, పంపకాలు జరిగాయి. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ మొత్తం ఆంధ్ర వాటా కింద వెళ్ళింది. ఆ ఒప్పందం ప్రకారం పటౌడీ హౌజ్‌లో ఉన్న ఖాళీ స్థలంలో తెలంగాణ భవన్ నిర్మాణం జరగాలి. కానీ? నిర్మాణం ఆలస్యం అవుతూ వస్తోంది. నిజం చెప్పాలంటే ప్రస్తుతం ఆంధ్ర భవన్‌లోనే తెలంగాణ భవన్ కొనసాగుతోంది. ఇది ఇలాగే ఉంటే ఏదో ఒకరోజున ఆంధ్ర వాళ్ళు ఖాళీ చేసి పొమ్మంటే మా పరిస్థితి ఏంటంటూ తెలంగాణ అధికారులు టెన్షన్ పడుతున్నారట. ఢిల్లీ భవన్ విభజన తర్వాత ఏపీకి 11.5 ఎకరాలు, తెలంగాణకు 8.2 ఎకరాలను కేటాయించారు, విభజన ప్రక్రియ మొత్తం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ప్రస్తుతం ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు ఉన్న స్థలం 19.7 ఎకరాలు. దాని విలువ 9వేల 913.505 కోట్లు ఉంటుంది. ఇది కూడా కేంద్ర హోంశాఖ చెప్పిన లెక్కే. వాస్తవానికి ఢిల్లీలో బహుళ అంతస్తుల నిర్మాణం కట్టాలంటే ప్రాసెస్ చాలా పెద్దది. మొదట ప్లాన్ రెడీ చేసి అనుమతులను కేంద్రం నుంచి తీసుకోవాల్సి ఉంటుంది.

సైబర్ టవర్స్ ఇక చరిత్రే

హైదరాబాద్ జూన్ 26, హైదరాబాద్ నగర ఐటీ రంగానికి పునాది వేసిన మొట్టమొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ భవనం చరిత్రగా మారిపోనుంది. అమెరికాకు చెందిన ఈ బహుళజాతి సంస్థ 1987లో బేగంపేట కేంద్రంగా నగరంలోనే మొదటి ఐటీ కార్యకలాపాలను ప్రారంభించింది. అయితే.. ఇటీవల ఈ భవనంలోని భూగర్భ నీటి సంపు దెబ్బతినడంతో భవన భద్రత దృష్ట్యా యాజమాన్యం దీన్ని పూర్తిగా కూల్చివేస్తోంది. ఒకప్పటి ఐటీ వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ ఐకానిక్ భవనం స్థానంలో సరికొత్త కమర్షియల్ బిల్డింగ్ నిర్మించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.నేటి తరం యువతకు ఐటీ కారిడార్, హైటెక్‌సిటీ అనగానే అందరికీ గుర్తొచ్చే ఏరియాలు మాదాపూర్, గచిబౌలి, నానక్‌రామ్‌గూడ, రాయదుర్గం. ఎటు చూసినా ఆకాశాన్ని తాకే గగనతలాలు, అత్యాధునిక గ్లాస్ బిల్డింగులే నేటి ఐటీ నగర రూపురేఖలు. కానీ.. హైదరాబాద్ నగరానికి చెందిన మొదటి తరం ఐటీ ఉద్యోగులను, అనుభవజ్ఞులను అడిగితే వారికి మొదటగా గుర్తొచ్చే ప్రాంతం బేగంపేట. ఎందుకంటే భాగ్యనగరంలో ఐటీ సామ్రాజ్యానికి తొలి పునాది పడింది ఇక్కడే. నగరంలోనే నిర్మితమైన మొట్టమొదటి ఐటీ టవర్‌గా ఖ్యాతిగాంచిన ఇంటర్‌గ్రాఫ్ భవనం పూర్తిగా కాలగర్భంలో కలిసిపోతోంది. ఆ ఐటీ భవన సముదాయాన్ని కూల్చివేసేందుకు యాజమాన్యం రెడీ అయింది.అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ ఇంటర్‌గ్రాఫ్ కన్సల్టింగ్ 1987లో బేగంపేటలో ఐటీ టవర్ నిర్మించింది. నగరంలో స్థాపించబడిన మొట్టమొదటి అంతర్జాతీయ బహుళజాతి సంస్థ ఇదే కావడం విశేషం. ఐటీ రంగంలో హైదరాబాద్ పేరు గ్లోబల్ మ్యాప్‌పైకి ఎక్కడానికి ఈ సంస్థే తొలి కారణం. దశాబ్దాల పాటు ఎంతోమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను తయారుచేసిన ఈ ఐకానిక్ భవనం ఇప్పుడు శాశ్వతంగా కనుమరుగవుతోంది. భవన భూగర్భంలో ఉన్న నీటి సంపు దెబ్బతినడం, పునాదులు బలహీనపడటంతో భవన భద్రతను దృష్టిలో ఉంచుకుని దానిని కూల్చివేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు కూల్చివేత పనులు జరుగుతున్నట్లు స్థానిక పోలీసులు ధృవీకరించారు. పాత భవనాన్ని పూర్తిగా తొలగించిన అనంతరం.. అదే స్థలంలో సరికొత్త అధునాతన కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది.మాదాపూర్‌లో సైబర్ టవర్స్‌ను నిర్మించి.. విప్రో, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ దేశీయ ఐటీ సంస్థలకు పెద్ద ఎత్తున భూములు కేటాయించేంత వరకు నగర ఐటీ రంగానికి బేగంపేట, అమీర్‌పేట ప్రాంతాలే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. అప్పట్లో అంతర్జాతీయ ప్రయాణాలకు అత్యంత అనువుగా.. నగర నడిబొడ్డున బేగంపేట విమానాశ్రయం అందుబాటులో ఉండటం కూడా ఈ ప్రాంతం ఐటీ హబ్‌గా ఎదగడానికి ప్రధాన కారణమైంది. ఆ రోజుల్లో బ్రిగేడ్, టాటా సెర్విజోల్, విప్రో ఎయిర్‌టెల్, ఇంటర్‌గ్రాఫ్ వంటి దిగ్గజ సంస్థలన్నీ బేగంపేట కేంద్రంగానే తమ కార్యకలాపాలను సాగించాయి.వీటితో పాటు మేఫిర్, సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లలో సత్యం కంప్యూటర్స్ సంస్థ తన కార్యకలాపాలను నడపగా.. పంజాగుట్టలో ఓఎస్ఐ, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో హెచ్ఎస్‌బీసీ, సియారా అట్లాంటిక్ సంస్థలు ఉండేవి. సోమాజిగూడ కేంద్రంగా ఏడీపీ, 24/7 కస్టమర్ వంటి అగ్రశ్రేణి కంపెనీలు నగరంలో ఐటీ విప్లవానికి ఊతమిచ్చాయి.

నాడు కొన్ని వందల మందితో ప్రారంభమైన ఐటీ ఉద్యోగుల ప్రస్థానం.. నేడు లక్షల మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరింది. ఎందరో మొదటి తరం సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉపాధినిచ్చి, జీవితాలను నిలబెట్టిన హైదరాబాద్ మొదటి ఐటీ టవర్ ఇంటర్‌గ్రాఫ్ భవనం నేడు జ్ఞాపకంగా మిగిలిపోతుండటంతో పాత తరం టెక్కీలు తీవ్ర భావోద్వేగానికి లోనవుతున్నారు.

ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

హైదరాబాద్, జూన్ 26, తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు .. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటే యాజమాన్యాలు ప్రైవేటు కాలేజీలను ఎలా నడుపుతారని నిలదీసింది. అదే సమయంలో రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బడ్జెట్ సమావేశాలు కూడా అయిపోయాయని.. ఇంకా పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో కాలేజీలను నడపడం కష్టంగా మారిందని.. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం కూడా కాలేజీలకు భారంగా మారిందని హైకోర్టు పేర్కొంది.ఈ క్రమంలోనే ప్రైవేటు కాలేజీలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను ఎప్పటి లోగా చెల్లిస్తారో చెప్పారని హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది ఆగస్ట్ 15వ తేదీ లోపు అన్ని బకాయిలను క్లియర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు వాదనలు వినిపించిన లాయర్ హైకోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రైవేటు కాలేజీల తరఫు వాదనలు వినిపిస్తున్న లాయర్.. ఆగస్టు 15వ తేదీ లోపు బకాయిలు మొత్తం క్లియర్ చేస్తే.. ఆరోజే తాము దాఖలు చేసిన పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని హైకోర్టుకు విన్నవించారు.ఇక ఈ వ్యవహారంలో పలువురు విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు మధ్య విద్యార్థులు తీవ్రంగా నలిగిపోతున్నారని విద్యార్థుల తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ పెండింగ్ బకాయిల ద్వారా విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. ఈ ఏడాది కొత్తగా కాలేజీల్లో చేరే విద్యార్థులకే ఇది వర్తించేలా చూడాలని.. విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మంగళవారానికి(జూన్ 30) వాయిదా వేసింది.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి ఎంపి భరత్

విశాఖపట్నం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించి యువతకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక పార్లమెంట్ సభ్యులు ఎం. భరత్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత విశాఖపట్నం నిర్మాణంతో పాటు ఆనందభరితమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు భారీ అవగాహన వాక్‌థాన్ నిర్వహించారు. ఎంపీ ఎం. భరత్, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఏపీ గ్రోవర్ ఆయిల్స్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ భాగస్వామ్యమయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ ఎం. భరత్ మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో మాదకద్రవ్యాల వ్యసనం ఒకటిగా మారిందన్నారు. కుటుంబ విలువలు, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం కలిగిన యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండగలరని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. ఇటీవల సెంట్రల్ జైలును సందర్శించిన సందర్భంగా గణనీయమైన సంఖ్యలో ఖైదీలు డ్రగ్స్ సంబంధిత కేసుల్లో ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తోందన్నారు.

రాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్లు

విశాఖపట్నం భారత రాష్ట్రపతి ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖలు అత్యంత అప్రమత్తతతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం, యూనివర్సిటీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, రాష్ట్రపతి కార్యాలయం నిర్దేశించిన ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమ వేదిక, భద్రతా ఏర్పాట్లు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వికారాబాద్‌లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 2కే రన్ నిర్వహణ

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన 2కే రన్ కార్యక్రమాన్ని శాసన సభా పతి గడ్డం ప్రసాద్ కుమార్ జెండా ఊపి ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు మున్సిపల్ చైర్మన్ మరియు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని 2కే రన్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తి ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని అన్నారు. యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో జీవిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రభుత్వం, పోలీసు శాఖతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ యువతకు సరైన మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు.

పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో..

హైదరాబాద్, జూన్ 26, ఈ ఏడాది ఖైరతాబాద్ బడా గణపతి 69 అడుగుల ఎత్తులో రూపొందించనున్నారు. పంచముఖ సంకటహర మహాగణపతి రూపంలో ఖైరతాబాద్ మహా గణేషుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడు. ఇక ఆ విగ్రహానికి ఒకవైపు సోమనాథ్ జ్యోతిర్లింగం.. మరోవైపు కాళీమాత విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఈసారితో ఖైరతాబాద్ ఉత్సవాలకు 72 ఏళ్లు పూర్తి కానున్నాయి. సెప్టెంబర్ 14న వినాయక చవితి జరగనుండగా.. తాజాగా కర్ర పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రసిద్ధి చెందిన వినాయక మండపాల్లో ఒకటైన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహా గణేశుడి ఉత్సవాలు నేటితో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. తాజాగా ఈసారి ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే మహా గణపతి నమూనా పోస్టర్‌ను ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఇవాళ ఆవిష్కరించింది. ఈ క్రమంలోనే ఘనంగా కర్రపూజను నిర్వహించింది. ఈసారి 69 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని.. పంచముఖ సంకటహార మహా గణపతి రూపంలో తయారు చేయనున్నారు. ఈ విగ్రహ నిర్మాణం పూర్తి కావడానికి 82 రోజులు పట్టనుంది. ఈసారి ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహంలో సోమనాథ్ జ్యోతిర్లింగం, కాళికామాత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రోజున ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా కర్రపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీంతో ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగినట్లయింది. ఈ పూజా తర్వాత ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్.. ఈ ఏడాది అక్కడ కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు.వినాయక చవితి ఈ ఏడాది సెప్టెంబర్ 14వ తేదీన రానుండగా.. నేటితో సరిగ్గా 82 రోజులు మిగిలి ఉన్నాయి. దీంతో ఈ 82 రోజుల్లోనే సర్వ హంగులతో కూడిన 69 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని.. ఉత్సవ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఇక ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు.. ఉద్రిక్తతలు తగ్గిపోయి.. అన్ని దేశాల్లో శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈసారి ఖైరతాబాద్ గణేశుడిని పంచముఖ సంకటహార మహా గణపతి రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తేల్చి చెప్పారు.ఈ భారీ వినాయకుడి విగ్రహానికి కుడివైపున ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని ఏర్పాటు చేయనున్నారు. అదే సమయంలో ఎడమ వైపున భక్తులను ఎల్లవేళలా కాపాడే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నట్లు ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. లోక కల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం ఇప్పుడు భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.

10 రెస్టారెంట్లలో 9 దారుణం

హైదరాబాద్, జూన్ 26, జొమాటో లేదా స్విగ్గి.. ఉబర్.. ఇలా ఎన్నో ఉన్నాయి. జస్ట్ ఫోన్ ఆన్ చేయడం.. యాప్ ఓపెన్ చేయడం.. ఆఫర్లు చూడడం.. నచ్చిన ఆహారం సెలెక్ట్ చేయడం.. ఆర్డర్ పెట్టడం.. పేమెంట్ ఆన్లైన్లోనే చేసేయడం.. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం డిన్నర్.. మధ్యలో స్నాక్స్.. చివరికి కేకులు.. బర్గర్లు.. పిజ్జాలు.. సూప్ లు కూడా అందులోనే.. ఆర్డర్ పెట్టిన కొత్త సమయానికి కళ్ళ ముందుకు వస్తుంది. కాళ్ల దగ్గరికి వస్తుంది. అలాంటప్పుడు ఇలాంటి తిండిని ఎవరు కాదనుకుంటారు..కొంతకాలంగా హైదరాబాదులో సగటు నగర జీవి ఇటువంటి రెడీమేడ్ ఫుడ్ కే అలవాటు పడ్డాడు. చివరికి వివాహం జరిగిన వారు సైతం ఆన్లైన్లోనే ఆర్డర్ పెట్టుకుంటున్నారు. వండే శ్రమ లేకుండా.. చెమటలు చిందించకుండా దర్జాగా తింటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. తెస్తున్న ఫుడ్ ఎలా ఉంటుంది.. ఎలాంటి పరిస్థితుల్లో తయారుచేస్తున్నారు.. వాటి వల్ల ఎలాంటి రోగాలు వస్తాయి ఎవరూ గుర్తించడం లేదు. చివరికి ఆఫీసర్లు చేసిన దాడుల్లో.. దిగ్భ్రాంతి కరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.హైదరాబాద్ నగరంలో ఈ నెలలో 10 రెస్టారెంట్లను అధికారులు తనిఖీలు చేస్తే.. అందులో తొమ్మిది అత్యంత దారుణంగా ఉన్నాయని తేలింది. చెత్తబుట్టలో వేయాల్సిన ఆహారాన్ని వారు విక్రయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దారుణమైన ఆహారాన్ని రకరకాల రంగులు.. మసాలాలు దట్టించి ప్లేట్లో పెడుతున్నారు.

అంతేరా..

ఈ రెస్టారెంట్ మదినగూడ లో ఉంది. ఇక్కడ కూరగాయలకు బూజు పట్టి ఉంది. వాడిన నూనె మళ్ళీ మళ్ళీ ఉపయోగించడానికి అధికారులు గుర్తించారు. పైగా ప్యాకెట్ల మీద లేబుల్స్ కూడా లేవు.

లులు హైపర్ మార్కెట్

చెత్తబుట్టలో వేయాల్సిన 150 కిలోల ఆహారాన్ని ఇక్కడ అధికారులు గుర్తించారు. వెంటనే దానిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైనేజీలు మొత్తం బ్లాక్ అయ్యాయి. అందులో పురుగులు ఉన్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలను గుర్తించిన అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఉడిపి ఉపహార్ మూసాపేట్

డ్రైనేజీలో దారుణంగా సమస్యలు ఉన్నాయి. పురుగులు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. చెత్తబుట్టల మీద మూతలు లేవు. వంట చేసేవారు సరైన జాగ్రత్తలు పాటించడం లేదు. లైసెన్స్ కూడా ముగిసిపోయింది.

చౌమన్, మాదాపూర్

ఇక్కడ మాంసాన్ని అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేశారు. శాకాహారం.. మాంసాహారం కలిపి నిల్వ చేశారు. కనీసం వాటి మీద మూతలు కూడా పెట్టలేదు.

జిస్మత్ జైల్ మండి, మదినగూడ

ఇక్కడ వంటలు వండే తీరు ఎలా ఉందంటే.. కనీసం వాటిని పందులు కూడా తినవు. ఐటమ్స్ లేబుల్స్ లేవు. సరైన నిలవలేదు. దీనికి ఎటువంటి గుర్తింపు లేదు. వాతావరణం అత్యంత దారుణంగా ఉంది.

రాయల్ స్పైసి, గచ్చిబౌలి

కీటకాలు తాండవం చేస్తున్నాయి. దుర్వాసన ముక్కులను పగలగొడుతోంది. నీరు దారుణంగా నిలిచిపోయింది. కిచెన్ అత్యంత అపరిశుభ్రంగా ఉంది. వంట కాదు కదా, ఇక్కడ ఐదు నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి.

సబ్ వే, కొండాపూర్

కుళ్ళిపోయిన కూరగాయలు వాడుతున్నారు. లేబుల్ లేని ఐటమ్స్ ఉపయోగిస్తున్నారు. సింక్ నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. ఆహార వృధా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

లాఫినోస్ పిజ్జా, జూబ్లీ ఎంక్లేవ్

బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇతర రెక్కల పురుగులు ఇష్టమొచ్చినట్టు తిరుగుతున్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉపయోగిస్తున్నారు. అపరిశుభ్రత అత్యంత దారుణంగా ఉంది.

ఫారెస్ట్ అధికారులను అడ్డుకున్న పోడు రైతులు

ఆసిఫాబాద్ ఆసిఫాబాద్ జిల్లాలో ఫారెస్ట్ అధికారులను పోడు రైతులు అడ్డుకున్నారు. మమ్మల్ని అరెస్ట్ చేసినా, చంపినా భూములను వదులుకోము అంటూ తెగేసి చెప్పారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పులస గ్రామ శివారులో అటవీ భూమిని జేసీబీతో చదును చేసేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారులను రైతులు అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మా తాతముత్తాతల నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని హక్కు పత్రాలు సైతం ఉన్నాయని అన్నారు. కానీ ఇప్పుడు వచ్చి మా భూములు లాక్కుంటే మేము మా పిల్లలు ఎట్లా బతకాలని ఫారెస్ట్ అధికారులను నిలదీసారు. ఉన్న ఈ భూములను లాక్కుంటే ఉపాధి కోల్పోయి కుటుంబాలతో రోడ్డున పడుతామని ఆవేదన వ్యక్తం చేసారు.

అనంతపురంలో ఉద్రిక్తత

అనంతపురం శుక్రవారం నాడు అనంతపురం లో ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి రోడ్డుపై బైఠాయించారు. తాడిపత్రి బయల్దేరిన అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి లను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల వైఖరికి నిరసనగా కోర్టు రోడ్డులో మాజీ ఎమ్మెల్యేలు అనంత, విశ్వేశ్వరరెడ్డి బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. పోలీసులు బారికేడ్లను అడ్డుగా పెట్టి వైసీపీ నేతలు కార్యకర్తలను అడ్డుకున్నారు.

పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత..

రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద బంధువుల ఆందోళన

మాచర్ల కాన్పు కోసం వచ్చి ఆసుపత్రిలోనే నవవధువు మృతి చెందింది. దాంతో ఆగ్రహించిన బంధువులు ఆసుపత్రి అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేసారు. మాచర్ల మండలం సుబ్బారెడ్డి పాలెం గ్రామానికి చెందిన పుణ్యమూర్తి సిలువకుమారి (25) డెలివరీ అయిన కాసేపటికే మృతి చెందింది. ఆడబిడ్డకు జన్మనిచ్చిన సిలువకుమారి, పాప క్షేమంగా ఉన్నా తల్లి కన్నుమూయడంతో కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. మొదటి కాన్పులోనే విషాదం ఆవరించింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ప్రాణం పోయిందని బంధువుల ఆందోళన .న్యాయం చేయాలంటూ ఆసుపత్రి ముందు బందువులు నిరసన కు దిగారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

తాడిపత్రి లో శుక్రవారం నాడు ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిబయట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తాడిపత్రిలో ప్రజాస్వామ్యం కాపాడాలి అంటూ నిరసన తెలిపారు. పోలీసులు కనుసన్నల్లో మట్కా, గంజాయి సాగు చేస్తున్నారంటూ పెద్దారెడ్డి నినాదాలు చేసారు. పోలీసులు జేసీ ప్రభాకర్ రెడ్డికు తొత్తులుగా పోలీసులు మారారు అంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డి ఇంటికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున చేరుకున్నారు. పెద్దారెడ్డి ఇంటికి వెళ్లకుండా నాలుగు వైపుల పోలీసులు భారీ ఎత్తున మోహరించారు.

ఎరువుల పంపిణీలో పారదర్శకతే లక్ష్యం... దుష్ప్రచారాలను నమ్మొద్దు

- ఒఖంఎఓ 2.0తో అక్రమ మళ్లింపులకు పూర్తిగా చెక్
- అక్రమాల దారులు మూసుకుపోవడంతోనే అసత్య ప్రచారం, పారదర్శక వ్యవస్థను చూసి కొందరిలో అసహనం
- నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అమరావతి, జూన్ 26: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా, సకాలంలో సబ్సిడీ ఎరువులు అందించేందుకు ప్రవేశపెట్టిన ఒఖంఎఓ 2.0 వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీ నుంచి కృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒఖంఎఓ 2.0 ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2,97,733 మంది రైతులకు 48,588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874 మెట్రిక్ టన్నుల డీఏపీ విజయవంతంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. దీనివల్ల అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందేలా పూర్తి భరోసా కల్పించామని మంత్రి పేర్కొన్నారు.రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ంఐఉఖీంజ) శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అవసరమైన పరిమాణంలోనే ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. దీంతో సమతుల్య ఎరువుల వినియోగం పెరిగి, రైతులకు దిగుబడులు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా సక్రమంగా వినియోగమవుతుందని చెప్పారు. ఒఖంఎఓ 2.0 ద్వారా ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, మళ్లింపులు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాలు పూర్తిగా అరికట్టే అవకాశం లభించిందన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై రాష్ట్రవ్యాప్తంగా రియల్‌టైమ్ పర్యవేక్షణ సాధ్యమవుతోందని, తిఈఓ, ఒఖంఎఓ, భౌతిక నిల్వల సమన్వయంతో ఖచ్చితమైన నిల్వల నిర్వహణ జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత తలెత్తకుండా, అవసరమైన సమయంలో అవసరమైన పరిమాణంలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా పంపిణీ నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. కౌలు రైతులతో సహా అర్హులైన ప్రతి రైతుకు సమాన అవకాశాలు కల్పించేలా ఈ వ్యవస్థ రూపొందించబడిందని చెప్పారు. ఎరువుల కొరత, నాణ్యత, అధిక ధరలు లేదా పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 155251 కు కాల్ చేయవచ్చని మంత్రి తెలిపారు.రైతులు తమ ఎరువుల కొనుగోలు చరిత్ర, అర్హత వివరాలను కూడా సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని, రైతు-కేంద్రీకృత, పారదర్శక, సాంకేతికత ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థగా ఒఖంఎఓ 2.0 వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఏ నిజమైన రైతుకూ ఎరువు నిరాకరించబడకూడదు... ఏ అనధికార వ్యక్తి లేదా రైతు కాని వ్యక్తికి సబ్సిడీ ఎరువు అందకూడదు అన్నదే ఒఖంఎఓ 2.0 మార్గదర్శక సూత్రమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవస్థ ప్రారంభ దశలో కొద్దిపాటి సాంకేతిక సమస్యలు ఎదురైనప్పటికీ వాటిలో అధిక భాగం ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఖాఖ లేదా సర్వర్‌కు సంబంధించిన తాత్కాలిక సమస్యలు ఎదురవుతున్నా, ప్రత్యేక సాంకేతిక బృందాలు 24ఖ7 పర్యవేక్షణ చేస్తూ వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఒఖంఎఓ 2.0 పూర్తిస్థాయిలో సజావుగా పనిచేస్తూ రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎరువుల పంపిణీ కొనసాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ ఎరువుల పంపిణీలో చోటుచేసుకున్న అక్రమాలు, మళ్లింపులు, నిల్వలు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాల వంటి అవకతవకలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడానికే ఒఖంఎఓ 2.0 వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ పారదర్శక విధానం అమలులోకి రావడంతో అక్రమాలకు అవకాశం లేకుండా పోయిందని, దీంతో కొందరి స్వార్థ ప్రయోజనాలకు గండిపడిందని పేర్కొన్నారు. అందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్ తనకు అనుకూలంగా ఉన్న పత్రిక ద్వారా రైతులను మభ్యపెట్టేలా నిరాధార కథనాలు ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో తనకు అనుకూలమైన కొందరు డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా యూరియా, డీఏపీ వంటి సబ్సిడీ ఎరువులను అక్రమంగా మళ్లించే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఒఖంఎఓ 2.0 వల్ల అలాంటి అక్రమాలకు పూర్తిగా చెక్ పడిందన్నారు. సాక్షి పత్రిక వాస్తవాలను పూర్తిగా విస్మరించి నిరాధార కథనాలను ప్రచురించడం బాధ్యతాయుత జర్నలిజానికి విరుద్ధం. క్షేత్రస్థాయి వాస్తవాలు, అధికారిక గణాంకాలు, సంబంధిత వివరాలను ధృవీకరించిన తర్వాతే వార్తలు ప్రచురించాలి. పత్రిక యజమాని జగన్ రెడ్డి చెప్పగానే అసత్య కథనాలతో రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు ప్రజలను తప్పుదోవ పట్టించడమే తప్ప ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడవు. నిజాలను తెలుసుకుని, వాస్తవాలను ప్రతిబింబించేలా బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చేసే ప్రయత్నాలను రైతులు విశ్వసించరని, పారదర్శక పాలనతో నిజమైన రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.టమాటా ధరలపై తప్పుడు ప్రచారాలను నమ్మొద్దురాష్ట్రంలో టమాటా ధరలు పూర్తిగా పతనమయ్యాయంటూ, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో నమోదవుతున్న అధికారిక ధరలను పరిశీలిస్తే టమాటా ధరలు స్థిరంగానే ఉన్నాయని తెలుస్తోందన్నారు. ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ కమిటీలో జూన్ 25న 10 కిలోల టమాటా

కనిష్ఠ ధర రూ.100, గరిష్ఠ ధర రూ.210, మోడల్ ధర రూ.180 నమోదైందన్నారు. అలాగే గుర్రంకొండ సబ్ మార్కెట్ యార్డులో 10 కిలోల టమాటా కనిష్ఠ ధర రూ.112, గరిష్ఠ ధర రూ.192, మోడల్ ధర రూ.152 నమోదైందని తెలిపారు. ఈ అధికారిక గణాంకాలే మార్కెట్‌లోని వాస్తవ పరిస్థితిని తెలియజేస్తున్నాయన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారం చేయడం వల్ల రైతుల్లో అనవసర ఆందోళన నెలకొనడమే కాకుండా మార్కెట్‌పై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అలాగే చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరులో ఉన్న జైన్ మ్యాంగో పల్ప్ యూనిట్‌కు సంబంధించి వస్తున్న ప్రచారంపై కూడా మంత్రి స్పందించారు. రెండు యూనిట్లలో ఒకటి నిరంతరంగా పనిచేస్తుండగా, మరో యూనిట్‌లో బాయిలింగ్ విభాగంలో ఏర్పడిన సాంకేతిక సమస్యను రెండు రోజుల వ్యవధిలోనే పరిష్కరించి తిరిగి కార్యకలాపాలు ప్రారంభించినట్లు అధికారుల నివేదికలో స్పష్టమైందన్నారు. యూనిట్ అనేక రోజులుగా నిలిచిపోయిందన్న ప్రచారం నిజం కాదని, ప్రస్తుతం మామిడి పండ్ల అన్‌లోడింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, నిరాధార ప్రచారాలను పట్టించుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రైతులకు శుభవార్త ఒకేసారి 'రైతుభరోసా' నిధులు రిలీజ్

హైదరాబాద్ తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఈసారి రైతుల ఖాతాల్లో ఒకేసారి జమ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో ఈ నెల 30న నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిధులను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం అధికారికంగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద ఎకరాకు రూ. 6 వేల చొప్పున, రెండు సీజన్లలో కలిపి మొత్తం రూ. 12 వేల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.ఈ వానాకాలం సీజన్‌లో రైతుభరోసా లబ్ధి పొందడానికి ప్రభుత్వం కీలక విధివిధానాలను ఖరారు చేసింది. ఈ నెల 15వ తేదీ నాటికి 'భూభారతి' పోర్టల్‌లో భూమి వివరాలు నమోదై, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సీసీఎల్ఏ నుంచి అనుమతులు పొందిన రైతులకు మాత్రమే ఈ సాయం అందుతుంది. అలాగే, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన గిరిజన రైతులు కూడా ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ నుంచి అనుమతులు పొంది ఉండాలి. అర్హులైన రైతుల రికార్డులను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఒక జిల్లా పరిధిలోనే దాదాపు 3.58 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉండగా, వారి కోసం రూ. 460 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ జాబితాలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 3,906 మంది రైతులు కూడా ఉన్నారు.

వినుకొండ డిపో బస్సు కండక్టర్ వీరంగం

మద్యం మత్తులో ఉండి ఒక చేతిలో సిగరెట్ పట్టుకొని ప్రయాణికుల తోటి బూతులతో వీరంగం...

పల్నాడు వినుకొండ నుంచి దోమల గూడెం వెళుతున్నటువంటి బస్సు లో నీ కండక్టర్ ఆడవారి పట్ల మరియు ప్యాసింజర్ పట్ల దుర్సుగా ప్రవర్తించడం.ఆడవారితో అసభ్య పదజాలం వాడటం వంటి చేస్తున్నారని బస్సులోని ప్రయాణికులు తెలియజేయడం జరిగింది కండక్టర్ డ్యూటీ టైం లో మద్యం సేవించి ఉన్నట్లు ప్యాసింజర్ చెప్తున్నారు. దీనిపై ఆర్టీసీ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు తెలిపారు.

పీఎఫ్ డబ్బులు రాక కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

వికారాబాద్ జిల్లా తాండూర్లో విషాద ఘటన చోటు చేసుకుంది. పిఫ్రీఫ్ డబ్బులు అందక మనస్తాపంతో హన్మమ్మ అనే కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలు జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తుంది. ఘటనలో ఆమె తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అదే ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్కు రిఫర్ చేసారు.

'గోల్డ్ మ్యాన్' సూర్య అరెస్ట్

హైదరాబాద్ సీఎం, పోలీస్ కమిషనర్లకు తాను అత్యంత సన్నిహితుడినని నమ్మించి, విదేశాల నుండి తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ ప్రజలను మోసం చేసిన 'గోల్డ్ మ్యాన్' సూర్యను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రజలు ఇలాంటి మోసగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలి

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జడ్చర్లలో భారీ వాకథాన్ ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి,

మహబూబ్ నగర్ అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియం, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్లో జడ్చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భారీ అవగాహన వాకథాన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది విద్యార్థులు, వాకర్స్, యువత, మహిళలు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి, హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక దుష్ప్రవర్తన అని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు మళ్లే యువత తమ జీవితాలను, కుటుంబాల ఆశలను, సమాజ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణం వ్యాపార, విద్యా మరియు రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉండటంతో, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ నివసిస్తూ ఉంటారని, ఈ పరిస్థితుల్లో మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాకు అవకాశాలు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

ప్రత్యేకంగా విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారి భవిష్యత్తు సురక్షితంగా ఉండేలా అందరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజికంగా తీవ్రమైన నష్టాలు సంభవిస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తి క్రమంగా కుటుంబానికి దూరమవడమే కాకుండా నేరప్రవర్తన వైపు వెళ్లే ప్రమాదం కూడా ఉంటుందని అన్నారు.

మహబూబ్నగర్ జిల్లాను పూర్తిగా డ్రగ్-ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడం పోలీసు శాఖ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనలో విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలందరి సహకారం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

తదుపరి మినీ స్టేడియం నుండి నేతాజీ చౌరస్తా వరకు భారీ వాకథాన్ ర్యాలీ నిర్వహించబడింది. ర్యాలీ మొత్తం డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సందడి చేసింది. నేతాజీ చౌరస్తా వద్ద జిల్లా ఎస్పీ గారు అందరితో కలిసి మాదకద్రవ్యాల వినియోగాన్ని దూరం పెట్టాలని, సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మినీ స్టేడియంకు తిరిగి చేరుకున్న తర్వాత విద్యార్థులు, ప్రజలు మానవహారంగా నిలబడి మాదకద్రవ్యాల నిర్మూలనకు మద్దతుగా పలు నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వాకింగ్ అసోసియేషన్ సభ్యులు, యోగా సభ్యులు, విద్యార్థులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

షేర్‌గూడలో ఉచిత మెడికల్ క్యాంప్

ప్రజలకు వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ

రంగారెడ్డి జిల్లా జూన్ 26; డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షేర్‌గూడ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఘనంగానిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు.ఈ శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ఫార్మసీ విద్యార్థులు మరియు వాలంటీర్లు సేవలందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను వివిధ ప్రాంతాల్లో నిరంతరం నిర్వహిస్తోందని సొసైటీ ఎక్స్ గ్యుటీ మెంబర్ జి.మాధవి తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య బృందం, వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్ నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత

గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి. "

వరంగల్ జూన్ 26 ; డ్రగ్స్ నియంత్రణ ప్రభుత్వం బాధ్యతే కాదు తల్లితండ్రులు వైద్యులు పోలీసులు మేధావులు స్వచ్ఛంద సంస్థలు సినీ ప్రముఖులుఉపాధ్యాయులు అందరి బాధ్యత అని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అని అన్నారు. శుక్రవారం హంటర్ రోడ్డు లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అరికట్టాలంటే నార్కోటి కంట్రోల్ రూమ్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వాల కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నార్కటి కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు డ్రగ్స్ ని అమ్మేవారిని పై కఠిన చర్యలు తీసుకుంటూ వారికి కౌన్సిలింగ్ ద్వారా మంచి మార్గంలో నడిచే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుంది జిల్లాలలో కమిషనర్ ఎస్పీ కలెక్టర్ వాళ్లు చెరువుతో మాదకద్రవ్యాలను అరికట్టడం అర్హనీయం ముఖ్యంగా సప్లై చేస్తే ఏరియాలో కాలేజీలు సినిమా హాలు కేసులు క్లబ్బులు హాస్టల్స్ దగ్గర నిఘా ఏర్పాటు చేయాలి ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా కాకుండా బార్డర్లలో సరైన జాగ్రత్తలు తీసుకొని ఎవరైతే గంజాయి రవాణా చేస్తారో వారిని పట్టుకొని వారిపై కఠిన చర్యలుతీసుకోవాల్సిందిగా కోరుతున్నాను డ్రగ్స్ అంతరించాలంటే మాదకద్రవ్యాలు అరికట్టాలంటే ప్రతి ఒక్కరు వారి భుజాల మీద వేసుకొని దానిపై పోరాడితేనే తప్ప అది అరికట్టలేమని రాజనాల శ్రీహరి అన్నారు వెంటనే ప్రభుత్వం ప్రజలు అధికారులు అందరూ చొరవతో డ్రగ్స్ ను గంజాయిని మాదకద్రవ్యాలను అరికట్టాల్సిందిగా రాజనాల శ్రీహరి విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో పోలేపాక ప్రసాద్ తులసి శశి మాగంటి శివగండ్రకోట రామచందర్ లో పాల్గొన్నారు

అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి

విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి
ఫిట్నెస్ లేని విద్యార్థుల బస్సు,వాహనాలను సీజ్ చెయ్యాలి.
ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ డిమాండ్

యాజమాన్యాల అక్రమ దోపిడిని అరికట్టాలని శుక్రవారం ఏఐఎస్ఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో సమావేశం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ మాట్లాడుతూ కౌతాళం మండలం లో ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్య హక్కు చట్టం నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి విద్యాసంస్థలను నడుపుతున్నారు. విద్యాసంస్థల ప్రారంభం నుండే విద్యార్థుల తల్లిదండ్రులను అడ్మిషన్ల పేరుతో భారీగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు. కొన్ని విద్యా సంస్థలు అయితే విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లోపం వల్లే ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు వాళ్లకిష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు , ఇప్పటికైనా ప్రభుత్వ నియామ నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు అలాగే విద్యార్థులకు కోసం ఏర్పాటు చేసుకున్న ఫిట్నెస్ లేని బస్సులు, వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు, చిన్న,శివ , ఆకాష్, నర్సప్ప, రాజు, నవీన్, దివాకర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం మండల కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి జీవో నెంబర్ ఒకటి కి వ్యతిరేకంగా నడుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల

ఫేమస్ ఫిష్ ఫ్రై'లో కృత్రిమ రంగులు

హైదరాబాద్ మల్లేపల్లిలోని 'ఫేమస్ ఫిష్ ఫ్రై' హోటల్లో తనిఖీ చేశారు. తనిఖీల్లో గడువు ముగిసిన ట్రేడ్ లైసెన్స్తో నడపడం, ఆహారంలో కృత్రిమ రంగులు వాడటాన్ని అధికారులు గుర్తించారు. అక్కడ లభించిన ఫుడ్ శాంపిల్స్ సేకరించి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఈూా) వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.

హైదరాబాద్ కు చెందిన నలుగురు మాచర్లలో రోడ్డు ప్రమాదంలో మృతి

పల్నాడు మాచర్ల పట్టణం నగరవనం వద్ద ఈరోజు ఉదయం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని తుఫాను వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తుఫాన్లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడ మృతి చెందారు. మృతులు హైదరాబాద్ నుండి కనిగిరి వెళ్తున్న క్రమంలో జరిగిన ఘటన చోటు చేసుకుంది. మృతులు కదిరి వెంకటేశ్వర్లు, కదిరి శారద, పిడుగు సత్యనారాయణ, పిడుగు అంజలి గా గుర్తించారు. మాచర్ల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారించారు.

టెట్ పై భయాందోళనలు వీడండి

-యుటిఎఫ్ టెట్ కోచింగ్ ప్రారంభోత్సవంలో డీఈవో షేక్ షంషుద్దీన్

బద్వేలు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పై భయాందోళనలు వీడాలని కడప జిల్లా డీఈవో షేక్ శంషుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కడపలోని యుటిఎఫ్ భవన్లో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టెట్ ఉచిత కోచింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎన్సీటిఈ మార్గదర్శకాలకు అనుగుణంగా 2028 ఆగస్టు 31 లోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష ఉత్తీర్ణత

సాధించాల్సి ఉందని, దీనిపై కొందరు ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొని ఉందని ఆయన పేర్కొన్నారు. టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయులకు ఆందోళన అవసరమేలేదని, బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడం పెద్ద సమస్యేమి కాదన్నారు. అయితే విద్యాబోధన ఒకవైపు, కుటుంబ బాధ్యతలు మరొక వైపు చూస్తూ టెట్ పరీక్షకు ప్రిపేర్ కావడం కొంత ఇబ్బందికరమని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భంలో ఉపాధ్యాయుల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉందన్నారు. ఇందులో భాగంగా యుటిఎఫ్ ఉపాధ్యాయులకు ఉచిత కోచింగ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. గతంలో కూడా యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన నిరుద్యోగులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ను నిర్వహించి నిరుద్యోగుల మన్ననలను అందుకున్నారన్నారు. యుటిఎఫ్ ఒకవైపు ఉపాధ్యాయుల సమస్యల పట్ల పోరాటాలు చేస్తూనే, మరోవైపు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. ఉపాధ్యాయ సంఘాల కృషి వల్ల ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహకాలు చేస్తున్నదని తెలిపారు . యుటిఎఫ్ నిర్వహించే కోచింగ్ ఉపాధ్యాయులు సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణతను తప్పనిసరి చేయడం సహేతుకం కాదన్నారు. బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయులలో నెలకొని ఉన్న ఆందోళనను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం 23 (1) కి సవరణ చేపట్టి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆలోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష పై దృష్టి కేంద్రీకరించి, సన్నద్ధతకు సమయం వెచ్చిస్తే పాఠశాలల్లో విద్య బోధన కుంటుపడుతుందని వారు పేర్కొన్నారు. యుటిఎఫ్ ఒకవైపు టెట్ పరీక్ష రద్దుకు పోరాటాలు చేస్తూనే మరోవైపు, ఉపాధ్యాయులను టెట్ ఉత్తీర్ణత పొందేందుకు కృషి చేస్తుందని వారు తెలిపారు. టెట్ ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులెవరూ ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని, ఉపాధ్యాయులు టెట్ పాస్ అయ్యేందుకు అవసరమైన కృషిని యుటిఎఫ్ చేస్తుందని వారు పేర్కొన్నారు. టెట్ పరీక్ష సులభంగా పాస్ అయ్యేందుకు యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నామ మాత్రపు ఖరీదుతో పుస్తకాలు రూపొందించి అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టెట్ బోధకులు కోవెల ప్రసాద్ రెడ్డి, బి.మస్తాన్ వలి యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్, ఎ.డి.దేవదత్తం, ఎన్.కంబగిరి, సి.సుదర్శన్, జె.వి.సుబ్బారెడ్డి, ఎ.వీరనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, చెరుకూరి శ్రీనివాసులు, బి.ప్రసన్నలక్ష్మి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లుడితో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

భర్తను హత్య చేసిన భార్య

నాగర్ కర్నూలు సొంత అల్లుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. అడ్డుకుగా వున్నాడని భర్తనే కడతేర్చింది. మొదట అనారోగ్యంతో మరణించాడని భావించిన ఘటనలో పోలీసులు విచారణ అనంతరం ఇది హత్యగా తేల్చారు. నాగర్కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామానికి చెందిన అమ్మపల్లి యాదయ్య, అలివేలు దంపతులు. అలివేలుకు తమ సొంత అల్లుడు ఆంజనేయులతో వివాహేతర సంబంధం ఏర్పడడంతో.. ఈ విషయం తెలుసుకుని తరచూ యాదయ్య భార్యతో గొడవపడుతున్నాడు. ఈ నెల 23న యాదయ్య ఇంట్లో మృతిచెందగా.. అనారోగ్యంతో మృతి చెందాడని కుటుంబ సభ్యులను, గ్రామస్తులను భార్య నమ్మించింది. అయితే అంత్యక్రియలకు ముందు శవానికి స్నానం చేయించి దుస్తులు మారుస్తుండగా శరీరంపై గాయాలు కనిపించడంతో అనుమానం వ్యక్తం చేస్తూ మృతుడి అన్న కుమారుడు పరశురాములు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు విచారణ చేపట్టి ప్రశ్నించగా.. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో అతని మర్మాంగాలపై దాడి చేసి హత్య చేసినట్లు భార్య అలివేలు ఒప్పుకుంది. అదే రోజు కూతురు, అల్లుడు కూడా ఇంటికి వచ్చి వెళ్లిన నేపథ్యంలో వారి పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో బంధువులు పేర్కొన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న "సర్కారు బాయి" సినిమా.

- హీరో శ్రీరామ్ నిమ్మల బర్త్ డే పోస్టర్ రిలీజ్

శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయన్స్ గా నటిస్తున్న సినిమా "సర్కారు బాయి". ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది.

ఈ రోజు హీరో శ్రీరామ్ నిమ్మల పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో తెలంగాణ పల్లె యువకుడిగా ఎంతో సహజంగా శ్రీరామ్ నిమ్మల కనిపిస్తున్నారు. "సర్కారు బాయి" సినిమా హీరోగా, నటుడిగా ఆయనకు మంచి పేరు తెస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి.

ప్రస్తుతం "సర్కారు బాయి" సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నెల 17వ తేదీ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి అనే ఊరిలో "సర్కారు బాయి" చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ లెంగ్తీ షెడ్యూల్ లో సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, ముఖ్య నటీనటులు బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లపై సీన్స్ షూటింగ్ చేస్తున్నారు. జూలై నెలాఖరు వరకు ఈ భారీ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు.

నటీనటులు – శ్రీరామ్ నిమ్మల, వర్షిక, బాహుబలి ప్రభాకర్, వివ రెడ్డి, నాగ మహేష్, దిల్ రమేష్, చలాకీ చంటి, చిట్టిబాబు, శివాని రెడ్డి, నుపూర్ ముఖర్జీ, తదితరులు

పలు భారతీయ భాషల్లోకి 'ఎల్‌జీబీటీ: ఏ లీగల్ బ్యాటిల్' చిత్రం

గ్రాడియంటే ఇన్ఫోటైన్‌మెంట్ లిమిటెడ్‌తో చేతులు కలిపిన శ్రావ్య ఫిల్మ్స్

ఉత్తమ చిత్రాల అవార్డు గ్రహీత, సామాజిక అంశాలపై తనదైన ముద్ర వేసిన దర్శకుడు పి. సునీల్ కుమార్ రెడ్డి తెరకెక్కించిన 'ఎల్‌జీబీటీ: ఏ లీగల్ బ్యాటిల్' చిత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా మరింత విస్తృత ప్రేక్షకాదరణ పొందేందుకు సిద్ధమవుతోంది.

జూన్ 19న ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో దేశవ్యాప్తంగా విడుదలైన ఈ తెలుగు చిత్రం ప్రేక్షకులు, విమర్శకులు, ఎల్‌జీబీటీ కమ్యూనిటీ నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం విజయవంతంగా రెండో వారంలో ప్రదర్శితమవుతున్న ఈ చిత్రాన్ని పలు భారతీయ భాషల్లో డబ్ చేసి విడుదల చేయాలని గ్రాడియంటే ఇన్ఫోటైన్‌మెంట్ లిమిటెడ్ ముందుకు వచ్చింది.

ఈ సందర్భంగా గ్రాడియంటే ఇన్ఫోటైన్‌మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విమల్ రాజ్ మాథుర్ మాట్లాడుతూ?

"సమాజానికి అవసరమైన సందేశాన్ని అందించే చిత్రంతో శ్రావ్య ఫిల్మ్స్‌తో భాగస్వామ్యం కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఎల్‌జీబీటీ: ఏ లీగల్ బ్యాటిల్ ప్రాంతీయ చిత్రంగా కాకుండా దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునే శక్తి కలిగిన సినిమా అని మేము విశ్వసిస్తున్నాం."

ఈ భాగస్వామ్యానికి ప్రముఖ వ్యాపారవేత్త, టీపీఎల్ ఛైర్మన్ రాజేష్ అగర్వాల్ విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ?

"మంచి సినిమాలకు సరైన వేదిక దొరికితే అవి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకోగలవు. పి. సునీల్ కుమార్ రెడ్డి గారి సృజనాత్మక దృష్టి, గ్రాడియంటే ఇన్ఫోటైన్‌మెంట్ మార్కెటింగ్ సామర్థ్యం కలిస్తే ఈ సినిమా మరింత విశాలమైన ప్రేక్షకులకు చేరుతుంది. ఈ భాగస్వామ్యం భవిష్యత్తులో మరిన్ని విలువైన, సామాజిక బాధ్యత కలిగిన చిత్రాలకు మార్గం సుగమం చేస్తుందని నమ్ముతున్నాను."

మీడియా కన్సల్టెంట్ సందీప్ జైన్ మాట్లాడుతూ?

"ఎల్‌జీబీటీ: ఏ లీగల్ బ్యాటిల్ ఒక ప్రాంతీయ కథ మాత్రమే కాదు. భారత ఉపఖండ సమాజంలో నిశ్శబ్దంగా మిగిలిపోయిన అనేక జీవితాల కథ ఇది. ఇలాంటి నిజాయితీతో కూడిన చిత్రాలు భాషల సరిహద్దులు దాటి ప్రపంచ ప్రేక్షకులను కూడా ఆలోచింపజేసే శక్తిని కలిగి ఉంటాయి."

ఈ సందర్భంగా శ్రావ్య ఫిల్మ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి. సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ?

"గ్రాడియంటే ఇన్ఫోటైన్‌మెంట్ లాంటి ప్రముఖ సంస్థతో కలిసి పనిచేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉంది. వారి అనుభవం, మార్కెటింగ్ నెట్‌వర్క్ ఈ చిత్రాన్ని మరింత విస్తృతస్థాయికితీసుకెళ్తుందని నమ్ముతున్నాను."

ఆయన ఇంకా మాట్లాడుతూ?

"నిజాయితీగా చెప్పిన కథలకు భాషా, భౌగోళిక సరిహద్దులు ఉండవు. మంచి కథ ఎక్కడైనా ప్రేక్షకుల మనసును తాకుతుంది. ఈ భాగస్వామ్యం మా రెండు సంస్థల మధ్య దీర్ఘకాలిక అనుబంధానికి నాంది కావాలని, భవిష్యత్తులో మరిన్ని అర్థవంతమైన, ప్రపంచ స్థాయి చిత్రాలను కలిసి నిర్మించే అవకాశాలు రావాలని కోరుకుంటున్నాను."

త్వరలోనే పలు భారతీయ భాషల్లో డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభం కానుండగా, 'ఎల్‌జీబీటీ: ఏ లీగల్ బ్యాటిల్' దేశవ్యాప్తంగా మరింత మంది ప్రేక్షకులను చేరుకునేందుకు సిద్ధమవుతోంది. సామాజిక స్పృహ కలిగిన ఈ చిత్రాన్ని భారతదేశంతో పాటు ప్రపంచ ప్రేక్షకులకు చేరవేయాలనే లక్ష్యంతో శ్రావ్య ఫిల్మ్స్ ? గ్రాడియంటే ఇన్ఫోటైన్‌మెంట్ లిమిటెడ్ భాగస్వామ్యం కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.

ఈ చిత్రంలో తారాగణం ; ఎల్ బి శ్రీరామ్ , ఎస్తర్ నోరోన్హా , రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతి నిగమ్ , విష్ణు తేజ , హిమ రాథోడ్, సనా ఖాన్ , లైలా ఓరుగంటి చంద్రముఖి తదితరులు.

ఈ పుట్టినరోజు నాకు చాలా ప్రత్యేకం - మాగంటి మురళీమోహన్

తన 86వ పుట్టినరోజు సందర్భంగా "పద్మశ్రీ" పురస్కారాన్ని పొందడం తనకు అనిర్వచనీయమైన ఆనందానుభూతిని ఇచ్చిందని అన్నారు ప్రముఖ నటులు – నిర్మాత – మాజీ పార్లమెంటు సభ్యులు

మురళీమోహన్. తెలుగు ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ మురళీమోహన్ ను ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఫిలింక్రిటిక్స్ గౌరవాధ్యక్షుడు సీనియర్ జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ... సౌమ్యుడు అజాత శత్రువు ఎవ్వరికి అందనివారు ఐన మురళీమోహన్ గారికి పద్మశ్రీ అవార్డు చాలా ఆలస్యంగా వచ్చింది. ఇది ఆయనకు ఎప్పుడో రావలసింది. మురళీమోహన్ గారి పుట్టిన రోజుకు ఒక రోజు ముందు ఈ అవార్డు అందుకోవడం అనేది ఆయనకు పుట్టినరోజు గిఫ్టుల అవుతుంది అన్నారు. అదే విధంగా ఫిలిం క్రిటిక్స్ కార్యవర్గం నిర్వహించి తలపెట్టిన మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని మీరు అనుమతిస్తే పెట్టుకుంటాము అని అన్నారు.

ఫిలింక్రిటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల ప్రసాదరావు మాట్లాడుతూ.. 58 ఏండ్ల చరిత్ర గలిగిన ఫిలింక్రిటిక్స్ అసోసియేషన్ ను .. తొలితరం జర్నలిస్టులు పి,యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి, గుడిపూడి శ్రీహరి తదితరులు స్థాపించారు. కొన్నాళ్ళుగా స్థబ్దుగా ఉన్న అసోసియేషన్ ఈ మధ్యనే పున: ప్రారంభమైంది. ఎన్నో కార్యక్రమాలు తలపెట్టి చేస్తున్నాము.

అందులో భాగంగా ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ నిర్వహించబోయే మీట్ ద ప్రెస్ కార్యక్రమానికి రావడానికి మురళీ మోహన్ గారు సుముఖత వ్యక్త పరిచినందుకు ఆనందంగా ఉంది అన్నారు.

ఫిలిం క్రిటిక్స్ ప్రధాన కార్యదర్శి సురేష్ కొండేటి మాట్లాడుతూ .. సినిమా పరిశ్రమలోని ప్రతి ఒక్కరు మురళీ మోహన్ గారికి పద్మశ్రీ పురస్కారం ఆలస్యంగా వచ్చింది అనుకుంటున్నారు. మురళీమోహన్ గారిని యావత్ చిత్ర పరిశ్రమ ఈ సందర్భంగా ఘనంగా సత్కరిస్తే బాగుంటుందని నేను అభిప్రాయపడుతున్నాను అన్నారు.

ఉపాధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇంత ఆలస్యంగా పద్మశ్రీ వచ్చినప్పటికీ సమర్థుడైన వ్యక్తికి వచ్చిందని భావిస్తున్నాము. భవిష్యత్ లో మీరు పద్మభూషణ్ కూడా అందుకోవాలని కోరుకుంటున్నాము అన్నారు.

ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ.... తనను పద్మశ్రీ పురస్కారానికి సిఫార్సు చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు సినిమా అభివృద్ధి కోసం విశేషంగా పాటుపడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. తెలుగు ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ తో తనకు గల సుదీర్ఘ అనుబంధాన్ని మురళీమోహన్ నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శక నిర్మాతలు అచ్చిరెడ్డి ఎస్. వి.కృష్ణ రెడ్డిలు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఫిలింక్రిటిక్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ప్రభు, అధ్యక్షుడు బత్తుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సురేష్ కొండేటి, ఉపాధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, ఉపకార్యదర్శులు శ్రీమతి పర్వీన్‌బాబి, శ్యామ్, కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్ట్ మామిడి పల్లి గిరిధర్, ధీరజ్ అప్పాజీ, నవీన్, ఆర్.డి,యస్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తత్వం' మూవీ టైలర్ విడుదల

కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయగలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దప్పిక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎడిటర్ విప్లవ్ నైషదం మాట్లాడుతూ " ఈ సినిమా జర్నీ ఎంతో స్పెషల్.. ఈ సినిమా కోసం అందరూ ఎంతో కష్టపడ్డారు. అర్జున్ సాఫ్టవేర్‌రంగం నుంచి వచ్చి ఎంతో ఇష్టంతో ఈ సినిమాకు దర్శకత్వం చేశాడు. ఎంతో అనుభవం ఉన్న దర్శకుడిలా ఈ చిత్రాన్ని డీల్ చేశాడు,. ఆద్యంత ఎంతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు నాకు సంతోషంగా ఉంది' అన్నారు.

సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ " ఈ రోజుల్లో చిన్న సినిమాల ద్వారా మంచి కంటెంట్‌ను ఇస్తున్నారు. ఆడియన్స్ కూడా ఆదరిస్తున్నారు. ఇది కూడా ఆ కోవలోకి వచ్చే చిత్రమే. ఈ సినిమా అందరికి తప్పకుండా నచ్చుతుంది. మంచి ఎమోషనల్ కనెక్టవిటి ఉన్న థ్రిల్లర్. సంగీతానికి స్కోప్ ఉన్న చిత్రమిది. అర్జున్ ఎంతో ప్రతిభ ఉన్న దర్శకుడు' అన్నారు.

ఎగ్జిక్యూటివ్ నిర్మాత భరత్ మాట్లాడుతూ " ట్రైలర్ అందరికి నచ్చింది. ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ కుదిరాయి. అందరూ ఈ సినిమా కోసం ఎంతో సపోర్ట్ చేశారు. అర్జున్ కోలా ఈ రోజు కోసం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నాడు. అనుకున్న కథను మించి దర్శకుడు తెరకెక్కించాడు. ఖర్చుకు రాజీపడకుండా నిర్మాతలు ఈ చిత్రాన్ని నిర్మించారు. అందరికి మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా' అన్నారు.

నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ " ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. ఈసినిమా మంచి అవుట్ పుట్ రావడానికి అందరూ సహకరించారు. అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

మరో నిర్మాత శ్వేత పసుపులేటి మాట్లాడుతూ " తత్వం టైటిల్‌కు తగ్గట్టుగా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఓ కొత్త సినిమాను చూశామన్నఅనుభూతికి లోనవుతారు. దర్శకుడు ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాడు. ఆయన కష్టానికి తగ్గ ప్రతిఫలం విజయం రూపంలో వస్తుందని నమ్ముతున్నాను' అన్నారు.

దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ " ఈ మూవీ టైటిల్, కాన్సెప్ట్‌ను మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్నాను. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఓకే చేశాడు. ఈ సినిమా కోసం అందరూ దిబెస్ట్ ఇచ్చారు. కథ తప్పకుండా అందర్ని ఎంగేజింగ్‌గా ఉంటుంది. వంశీ గారి అన్వేషణ తరహాలోనే అందర్ని కట్టిపడేసే సినిమా ఇది. ఈ సినిమాలో ఉంటే ట్విస్ట్ ఆడియన్స్‌కు షాకింగ్‌గా ఉంటుంది।'అన్నారు.

హీరో దినేష్ తేజ్ మాట్లాడుతూ "నేను కలిసి పనిచేయాలనుకున్న టెక్నిషియన్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేశాను. ఈసినిమాతో చాలా మంది కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. అందరం చాలా కష్టపడ్డాం. అది సినిమా చూసిన తరువాత అందరికి తెలుస్తుంది. ఇక మీద నా సినిమాలకు గ్యాప్ రాదు. ఈ తత్వం తరువాత నేను సినిమాలతో బిజీ అవుతున్నాను. నా కెరీర్‌కు ఇది టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుంది. అందరి సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని మంచి సినిమాలు చేస్తాను. కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారు. సో.. అలాంటి బలమైన కంటెంట్‌తో రాబోతున్న తత్వంను ప్రేక్షకులు సక్సెస్ చేస్తారని నమ్ముతున్నాను అన్నారు.

.ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: భరత్ రోంగలి, ఎడిటర్: విప్లవ్ నైషదం,కెమెరా: భరత్ పట్టి, డిఐ: భూషణ్, దర్శకుడు: అర్జున్ కోల, నిర్మాత: వంశీ సీమకుర్తి.,శ్వేత పసుపులేటీ

గోషామహల్ డివిజన్‌లోని 116వ బూత్‌లో SIR ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రారంభం

నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి: హైదరాబాద్, జూన్ 26, 2026: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా గోషామహల్ డివిజన్‌లోని 116వ బూత్ వద్ద బూత్ లెవల్ ఆఫీసర్ (BLO) ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా బీజేపీ దూరూ-2 శ్రీ నటరాజ్ నామ్‌ధారి, మాజీ కార్పొరేటర్ శ్రీ లాల్ సింగ్తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. BLOలకు సహకరిస్తూ ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పూరించడంలో సహాయం చేసి, సాధారణ ఓటర్లకు ఓటరు నమోదు, వివరాల ధృవీకరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమేష్, మణిమూరి సాయి, డోమాల, లక్ష్మీనారాయణ పనగంటి, రాజా జోహారి, సుధాకర్ గౌడ్, నర్సింగ్ అప్పా తదితర బూత్ కార్యకర్తలు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రతి అర్హత కలిగిన ఓటరు BLOలకు సహకరించి, ఓటరు జాబితాను ఖచ్చితంగా, నవీకరించబడిన విధంగా రూపొందించేందుకు సహకరించాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

మంత్రి దామోదర్ రాజనరసింహ కృషి ఫలితం -- ఆందోల్ నియోజకవర్గంలో రూ.16 కోట్ల రోడ్ల అభివృద్ధి పనులు మంజూరు

పుల్కల్ మండలం ముద్దయిపేట్ చౌరస్తా నుండి సంగుపేట్ ఎక్స్ రోడ్ వరకు ఉన్న రోడ్డుకు మొండిచేయి

ఈ రోడ్డు విషయమై ఎన్నిసార్లు పత్రికల్లో కథనాలు వచ్చిన మొద్దు నిద్రలో అధికారులు

ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 26 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ, ప్రత్యేక చొరవతో చౌటకూర్, మండలంలోని (హెచ్ఎంఆర్) పరిధిలోని 5, రెవిన్యూ గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు. మొత్తం రూ. 16 కోట్లతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టనున్న ప్రభుత్వం.



వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, కోర్పోల్, శివంపేట్, వెండికోల్, గ్రామాల ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందనున్నాయి(1-వెంకటకిష్టాపూర్,నుండి లింగంపల్లి,వరకు బీటీ రోడ్డు నిర్మాణం పొడవు: 3.00 కి.మీ.అంచనా వ్యయం: రూ.4.50 కోట్లు(2- ఎన్‌హెచ్--161 నుండి సుల్తాన్‌పూర్--కర్పోల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం పొడవు: 3.00 కి.మీ. అంచనా వ్యయం: రూ.4.00 కోట్లు (3-శివంపేట్ గ్రామంలో సీసీ రోడ్లు మరియు సైడ్ డ్రెయిన్ల నిర్మాణం పొడవు: 0.50 కి.మీ, అంచనా వ్యయం, రూ.1.00 కోటి (4-ఎన్‌హెచ్--161 నుండి శివంపేట్--వెండికోల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం పొడవు: 5.00 కి.మీ అంచనా వ్యయం రూ.6.50 కోట్లు(హెచ్ఎంఆర్ ,)పరిధిలో చేరిన గ్రామాల, మౌలిక వసతుల అభివృద్ధికి మరో కీలక అడుగు. ఆందోల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల సౌకర్యాలే లక్ష్యంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ, నిరంతర కృషి, అలాగే పుల్కల్ మండలం ముద్దాయి పేట్ చౌరస్తా నుండి ముదిమాణిక్యం ఇటిక్యాల, ఎక్స్ రోడ్ వరకు ఉన్నటువంటి రోడ్డును బీటీ రోడ్డు వేయకుండా, కంకర వేసి వదిలేసి, కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలకు దగ్గరకు వస్తున్న,పాత రోడ్లను వదిలేసి, ఇప్పుడు మళ్లీ కొత్త రోడ్లకు నిధులు మంజూరు చేయడంపై పుల్కల్ మండల ప్రజలు అగ్రహావేశాలు వెలిబుచ్చుతున్నారు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి న్యాయమూర్తి బ్లెస్సి

జహీరాబాద్ ,జూన్ 26, ప్రజాబలం ప్రతినిధి: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పునస్కరించుకొని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక నవచైతన్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి విద్యార్థులకు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో, పెద్దలను గౌరవిస్తూ, చక్కగా చదువుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఈ దశలో మత్తు, మాదక ద్రవ్యలకు అలవాటు పడే అవకాశం చాలా ఎక్కువగా ఉందని, ఒకవేళ దురవ్యసనాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని అన్నారు. విద్యార్థులు అందరు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఒకవేళ అలాంటివారు ఎవరైనా మీ పరిసర ప్రాంతాల్లో ఉంటే గనక మా దృష్టికి తీసుకురావచ్చని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. నిత్యజీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదురుకాకుండా ఉండడానికి, ఒకవేళ సమస్యలు ఎదురైతే వాటిని అధిగమించడానికి చట్టాలు తొడ్పాడుతాయని సూచించారు. కార్యక్రమంలో మదకద్రవ్యాల నిరోధక చట్టం, బాలకార్మిక నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, ఉచిత న్యాయసేవా సహాయంపై విద్యార్థులకు తెలియజేసారు. విద్యార్థులందరూ చట్టాలను గౌరవిస్తూ, అవసరమైతే తోటివారికి తెలియజెప్పాలని సూచించారు. ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,న్యాయవాదులు గోపాల్, విశ్వనాథ్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల వెతలు పడుతున్న కష్టాలు

రైతు సేవ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు

ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 26 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా: వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో, యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు, మరోసారి వెలుగులోకి వచ్చాయి, నియోజకవర్గంలోని పలు మండలాలలో, రైతు సేవా కేంద్రానికి యూరియా నిల్వలు వచ్చాయని, సమాచారం అందడంతో, పెద్ద ఎత్తున రైతులు కేంద్రాల వద్దకు చేరుకొని, పడిగాపులు కాస్తున్నారు, పంటలకు ఎరువులు అత్యవసరంగా అవసరం అవుతున్న నేపథ్యంలో, ఎలాగైనా యూరియా పొందాలని రైతులు, గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి ఉంటున్నారు, యూరియా పంపిణీ యాప్ ద్వారా, ఆన్లైన్ బుకింగ్ విధానంలో నిర్వహిస్తామని, కేంద్రం ప్రతినిధులు ప్రకటించడంతో, రైతులు తమ మొబైల్ ఫోన్లతో సిద్ధమయ్యారు, అయితే బుకింగ్ ప్రారంభమైన కొద్ది నిమిషాలకే, మొత్తం స్టాక్ అంతా బుకింగ్ అయిపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు, మిగతా రైతులు యూరియా లేక వెను తిరగాల్సిన పరిస్థితి నెలకొంటుంది, కొంతమంది రైతులు యాప్ లో సాంకేతిక లోపాలు ఎదురయ్యాయని , బుకింగ్ సమయంలో సర్వర్ నెమ్మదిగా పనిచేయడంతో, తమకు అవకాశం దక్కలేదని, రైతులు ఆరోపించారు, ఒకేసారి పరిమిత స్టాక్ విడుదల చేయడం వల్ల, నిజంగా అవసరమైన రైతులకు, యూరియా అందడం లేదని, మరికొందరు రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు...

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి.

వరంగల్ డిఎంహెచ్ఓ సాంబశివరావు పిలుపు.

5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివ రావు అన్నారు. దేశవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని వరంగల్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివ రావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల 75,621 మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు 456 పోలియో బూత్‌లు, 16 ట్రాన్సిట్ పాయింట్లు 21 మొబైల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 89 హై-రిస్క్ ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న 3,740 మంది చిన్నారులకు మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం సమర్థవంతంగా అమలయ్యేలా 46 మంది పర్యవేక్షకులను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్వైజర్లు, వాలంటీర్లు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది భాగస్వాములవుతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాన్ని తాను ఆరుగురు ప్రోగ్రాం అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 29, 30 నాడు ఆరోగ్య సిబ్బంది ఇంటి ఇంటి సందర్శన చేసి వివిధ కారణాలతో పోలియో చుక్కలు వేయించు కోని వారిని గుర్తించి వారికి పోలియో చుక్కలు వేస్తారు అని అన్నారు. 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం రోజున తమ సమీపంలోని పోలియో బూత్‌కు చిన్నారులను తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రయాణాల్లో ఉన్న తల్లిదండ్రులు బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ పోలియో బూత్‌లలో తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు.

పోలీసులు వేధిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆత్మహత్యాయత్నం

పెద్దపల్లి ఎస్సై వేదింపులకు గురిచేస్తున్నాడని బీ ఆర్ ఎస్ నాయకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసాడు. పెద్దపల్లి మండలం నిట్టురు గ్రామానికి చెందిన కల్లెపు సంపత్ రావు పెద్దపల్లి పట్టణ ఎస్. ఐ వేదింపులకు గురిచేస్తున్నాడనీ పురుగుల మందుతాగి ఆత్మహత్యం యత్నం చేసాడు. కరీంనగర్ సన్ రైస్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీ ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలపై కొనసాగుతున్న అక్రమ కేసులు పెడుతున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు.

నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి: గోషామహల్ నియోజకవర్గం బేగంబజార్ డివిజన్ లో SIR సర్వే లో భాగంగా దూరూ శివకాంత్ కు సహకరిస్తూ ఓటర్ లకు ఏనేమురేషన్ ఫారం లు అందిస్తున్న బద్దం సతీష్ గౌడ్ కన్వినర్ గోషామహల్ నియోజకవర్గం డెవలప్మెంట్ ఫోరమ్, చేతనే యూత్ కాంగ్రెస్ జెనరల్ సెక్రటరీ, ఆనంద్, అశోక్, శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు కూడా ఎశ్రీశీ లకు సహకరించడం జరిగింది

ఆధునిక న్యాయ విద్యా బోధనపై వారం రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించిన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్

హైదరాబాద్, జూన్ 26, 2026:(ప్రజాబలం ప్రతినిధి) ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (IFHE)కు చెందిన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, "ఫలితాల ఆధారిత విద్య (Outcome-Based Education - OBE) మరియు వినూత్న న్యాయ బోధనా విధానాలు" అనే అంశంపై నిర్వహించిన వారం రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం (Faculty Development Programme - FDP)ను విజయవంతంగా పూర్తి చేసింది. జూన్ 22 నుండి 26, 2026 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమం శుక్రవారం ×భీఎజు ఆడిటోరియంలో జరిగిన ముగింపు సమావేశంతో ముగిసింది.

ఈ ఎఫ్‌డీపీ దేశవ్యాప్తంగా వివిధ న్యాయ విశ్వవిద్యాలయాలు, లా స్కూల్స్‌కు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, న్యాయ విద్యావేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఆధునిక న్యాయ విద్యలో చోటుచేసుకుంటున్న మార్పులు, వినూత్న బోధనా విధానాలు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, ఫలితాల ఆధారిత విద్య (OBE) అమలు వంటి అంశాలపై సుదీర్ఘ చర్చలకు అవకాశం కల్పించింది.

ముగింపు కార్యక్రమానికి మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, ఛత్రపతి సంభాజీనగర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ (డా.) బిందు ఎస్. రోనాల్డ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం మరియు ప్రపంచవ్యాప్తంగా న్యాయ విద్యలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా న్యాయ అధ్యాపకులు తమ బోధనా విధానాలను నిరంతరం నవీకరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, నైతిక విలువలు, ప్రాయోగిక నైపుణ్యాలు, బహుశాఖ విజ్ఞానాన్ని పెంపొందించడంలో ఫలితాల ఆధారిత విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఆమె అన్నారు. న్యాయ విద్యా నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ఇలాంటి సమయోచిత కార్యక్రమాన్ని నిర్వహించిన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌ను ఆమె అభినందించారు.

కార్యక్రమ ముగింపు సందర్భంగా ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డా.) పూజారి రవిశేఖరరాజు మాట్లాడుతూ, దేశంలోని పలు విద్యాసంస్థల నుండి వచ్చిన అధ్యాపకులు చురుకుగా పాల్గొనడం ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమని అన్నారు. ఉన్నత విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు నిరంతరం తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యా నాణ్యత, పరిశోధన, వినూత్నత, అధ్యాపకుల సామర్థ్యాభివృద్ధికి ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో తమ విలువైన అనుభవాలను పంచుకున్న వనరుల నిపుణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ (డా.) ఎం.డి. అక్బర్ ఖాన్ కార్యక్రమ నివేదికను సమర్పిస్తూ, ఐదు రోజుల పాటు జరిగిన ఈ ఎఫ్‌డీపీలో ఫలితాల ఆధారిత విద్య, వినూత్న న్యాయ బోధనా విధానాలు, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, మూల్యాంకన విధానాలు, అనుభవాధారిత అభ్యాసం, పరిశోధన పద్ధతులు, డిజిటల్ సాంకేతికతల వినియోగం, జాతీయ విద్యా విధానం (చీజ్రూ) అమలు వంటి అంశాలపై ప్రముఖ విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, సీనియర్ ప్రొఫెషనల్స్ ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు, పరస్పర చర్చా సమావేశాలు నిర్వహించినట్లు వివరించారు.

కార్యక్రమం ముగింపులో ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సయన్ దాస్ వందన సమర్పణ చేశారు. ముఖ్య అతిథి, వనరుల నిపుణులు, పాల్గొన్న అధ్యాపకులు, నిర్వహణ కమిటీ, సహకరించిన సంస్థలు, విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా ముగియడం ద్వారా న్యాయ విద్యలో నాణ్యతను పెంపొందించడం, అధ్యాపకుల వృత్తిపరమైన అభివృద్ధికి వేదికలను కల్పించడం, జ్ఞాన మార్పిడి మరియు పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడం పట్ల ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ తన నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది. ఈ కార్యక్రమం ద్వారా పాల్గొన్న అధ్యాపకులు వినూత్న బోధనా విధానాలను అవగాహన చేసుకోవడంతో పాటు, ఫలితాల ఆధారిత విద్యపై మరింత లోతైన అవగాహనను పెంపొందించుకుని, భారతదేశంలో నాణ్యమైన న్యాయ విద్య అభివృద్ధికి తమ వంతు సహకారం అందించే అవకాశాన్ని పొందారు.

ఆందోల్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మర్రి అరుణ కుమారి నియామకం

ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 26 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ,ఆమోదంతో మర్రి అరుణ కుమారిని, ఆందోల్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమిస్తూ, అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు,ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్‌ను నియోజకవర్గంలో, మరింత బలోపేతం చేస్తూ, మహిళలను సంఘటితం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తారనే విశ్వాసాన్ని పార్టీ నాయకత్వం వ్యక్తం చేసింది,ఈ నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్, ఆందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, మరియు పార్టీ కార్యకర్తలకు, మర్రి అరుణ కుమారి, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు,నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మహిళా కాంగ్రెస్ సంస్థ బలోపేతం, పార్టీ అభివృద్ధి, ప్రజాసేవ కోసం,అంకితభావంతో పనిచేస్తానని ఆమె తెలిపారు.

తుమ్మలపల్లి మొహరం పండుగ సంబరాల్లో పాల్గొన్న ప్రజా జననేత పాండు

వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 26 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో మొహరం పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించినట్టు తెలిపారు మొహరం పండుగలో సర్పంచ్ అభ్యర్థిగా నిలబడ్డప్రజా జననేత పాండు మరియు గ్రామ పెద్దలు యువకులు పెద్ద ఎత్తున మొహరం పండుగ సంబరాలు పాల్గొని ఆనందంగా పండుగ జరుపుకున్నట్టు తెలిపారు

మంత్రి దామోదర్ రాజనరసింహ కృషి ఫలితం -- ఆందోల్ నియోజకవర్గంలో రూ.16 కోట్ల రోడ్ల అభివృద్ధి పనులు మంజూరు

పుల్కల్ మండలం ముద్దయిపేట్ చౌరస్తా నుండి సంగుపేట్ ఎక్స్ రోడ్ వరకు ఉన్న రోడ్డుకు మొండిచేయి

ఈ రోడ్డు విషయమై ఎన్నిసార్లు పత్రికల్లో కథనాలు వచ్చిన మొద్దు నిద్రలో అధికారులు

ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 26 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనరసింహ, ప్రత్యేక చొరవతో చౌటకూర్, మండలంలోని (హెచ్ఎంఆర్) పరిధిలోని 5, రెవిన్యూ గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు.మొత్తం రూ.16 కోట్లతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టనున్న ప్రభుత్వం.వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, కోర్పోల్, శివంపేట్, వెండికోల్, గ్రామాల ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందనున్నాయి(1-వెంకటకిష్టాపూర్, నుండిలింగంపల్లి,వరకు బీటీ రోడ్డు నిర్మాణం పొడవు: 3.00 కి.మీ.అంచనా వ్యయం: రూ.4.50 కోట్లు(2- ఎన్‌హెచ్--161 నుండి సుల్తాన్‌పూర్--కర్పోల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం పొడవు: 3.00 కి.మీ. అంచనా వ్యయం: రూ.4.00 కోట్లు

(3-శివంపేట్ గ్రామంలో సీసీ రోడ్లు మరియు సైడ్ డ్రెయిన్ల నిర్మాణం పొడవు: 0.50 కి.మీ, అంచనా వ్యయం, రూ.1.00 కోటి (4-ఎన్‌హెచ్--161 నుండి శివంపేట్--వెండికోల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం పొడవు: 5.00 కి.మీ అంచనా వ్యయం రూ.6.50 కోట్లు(హెచ్ఎంఆర్ ,)పరిధిలో చేరిన గ్రామాల, మౌలిక వసతుల అభివృద్ధికి మరో కీలక అడుగు.ఆందోల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల సౌకర్యాలే లక్ష్యంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ, నిరంతర కృషి, అలాగే పుల్కల్ మండలం ముద్దాయి పేట్ చౌరస్తా నుండి ముదిమాణిక్యం ఇటిక్యాల, సంగుపేట, ఎక్స్ రోడ్ వరకు ఉన్నటువంటి రోడ్డును బీటీ రోడ్డు వేయకుండా, కంకర వేసి వదిలేసి, కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలకు దగ్గరకు వస్తున్నపాత రోడ్లను వదిలేసి, ఇప్పుడు మళ్లీ కొత్త రోడ్లకు నిధులు మంజూరు చేయడంపై పుల్కల్ మండల ప్రజలు అగ్రహావేశాలు వెలిబుచ్చుతున్నారు.

కొడంగల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞత సభ

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎక్కటి సంజీవరెడ్డి

హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూన్ 26మ్మికుంట పట్టణం లోనీ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడుతూ చలో కొడంగల్ కారు ర్యాలీని జయప్రదం చేయాలని కోరడం జరిగింది. 28 వ తేదీ ఆదివారం రోజున చేవెళ్ల వెంకటేశ్వర స్వామి టెంపుల్ నుండి కొడంగల్ వరకు జరిగే ర్యాలీని జయప్రదం చెయ్యాలి ఉద్యమకారుల ఫోరం కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టడం, అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేకే కమిటీ వెయ్యడం తో పటూ టఫ్ విజయము చెప్పక

తప్పదు, అదేవిధంగా కమిటీ కాలయాపన లేకుండా ఉద్యమకారుల ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో కృతజ్ఞత సభ చేసే కార్యక్రమానికి 33 జిల్లాల ఉద్యమకారులు, అదేవిధంగా కరీంనగర్ జిల్లా ఉద్యమకారులు స్వచ్ఛందంగా కారు ర్యాలీలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్న. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మూడేళ్ల కుమారస్వామి కాన్టెన్సీ ఇన్చార్జి ఆరే రమేష్ రెడ్డి, రేణిగుంట్ల రజిని కుమార్, జమ్మికుంట టౌన్ అధ్యక్షులు మద్దూరి శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్ర భూమిరెడ్డి, ఉపాధ్యక్షులు రాం రాజబాబు, ఎజ్జే తిరుపతి, ఇమ్మడి రాజు, మోతే స్వామి, ఇమ్మడి రాజు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కనవేని సతీష్ కుమార్, రచ్చ గణేష్, అక్కనపెల్లి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక క్షేత్రంలో మొహర్రం వేడుకలు

పెద్దపల్లి/గోదావరిఖని, జూన్-26, ప్రజాబలం: సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారంసింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో మొహర్రం వేడుకలు మత సామరస్యానికి నిదర్శనంగా నిలిచాయి. కార్మిక శ్రేణిలోని వైవిధ్యభరితమైన సంస్కృతులు, ఆచారాలు ఇక్కడ కలిసిపోయి ఒక విశిష్టమైన వేడుకకు దారితీశాయి. బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు కులమతాలకు అతీతంగా ఈ వేడుకల్లో పాల్గొని, శాంతి మరియు సోదరభావంతో పీరీలను దర్శించుకున్నారు.

అలాగే పారిశ్రామిక ప్రాంత ప్రతి కాలనీల్లో ప్రత్యేకంగా పీరీలను ఊరేగింపు చేశారు. కేవలం ముస్లిం లే కాకుండా, ఈ ప్రాంతంలో ఇతర మతాలకు చెందిన కార్మికులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకోవడం విశేషం. చౌరస్తాలో షర్బత్ పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు చేశారు.

పట్లూర్ మొహరం పండుగలో చిందేసిన కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్, సురేష్ యాదవ్, సర్పంచ్ పరశురాం

వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 26 (ప్రజా) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో మొహరం పండుగ సందర్భంగా చిన్నల్లు పెద్దలు వృద్ధులు యవనస్తులు గ్రామస్తులు గ్రామ పెద్దలు హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ ఎంతో సంతోషంగా మొహరం పండుగ జరుపుకున్నట్టు తెలిపారు మొహరం పండుగలో మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్ మరియు గ్రామ సర్పంచ్ పరశురాం మరియు గ్రామస్తులు కలిసి మొహరం పండుగ సందర్భంగా చిందేసి ఆడుతున్న దృశ్యం చూసి గ్రామ ప్రజలందరూ సంతోషం వ్యక్తపరిచారు ఈనాడు గ్రామాల్లో అన్ని పండుగలు అన్ని

వర్గాల వారు కలిసిమెలిసి పండుగ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని గ్రామ సర్పంచ్ పరశురాం తెలిపారు దర్గాలో గ్రామ పెద్దలు అందరూ కూర్చొని దేవుని సన్నిధిలో ప్రశాంతమైనటువంటి వాతావరణంలో ముచ్చటిస్తూ మొహరం పండుగలో పాల్గొన్నట్టు తెలిపారు

పట్లూర్ సర్పంచ్ పరశురాం బర్త్డే సంబరాలో పాల్గొన్న మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్

వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 26 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం ప ట్లూరు గ్రామ సర్పంచ్ పరశు రాం బర్త్డే సంబరాల్లో పాల్గొన్న మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ కుమార్ యాదవ్, ఉప సర్పంచ్ అఖిల్, మాజీ ఎంపిటిసిలు వార్డు మెంబర్లు పెద్దలు ఆత్మీయులు పాల్గొని బర్త్డే సంబరాలు తెలిపారు

కీళ్ల మార్పిడి లేకుండానే అధునాతన 'కీళ్ల పరిరక్షణ' చికిత్సలు

-ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ ఆదిత్య రెడ్డి

?జహీరాబాద్, జూన్ 26 ప్రజాబలం ప్రతినిధి: ఆర్థోపెడిక్ వైద్య రంగంలో సరికొత్త విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ముఖ్యంగా కీళ్ల మార్పిడి అవసరం లేకుండానే సహజమైన కీళ్లను కాపాడుకునే కీళ్ల పరిరక్షణ చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఆదిత్య రెడ్డి తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని సిటీ సెంటర్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ట్రామా, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థ్రోస్కోపీ మరియు స్పోర్ట్స్ ఇంజూరీస్ విభాగాల్లో నిపుణులైన ఆయన, వైద్య రంగంలో వచ్చిన పలు అధునాతన చికిత్సా విధానాలను వెల్లడించారు.

?వృద్ధుల్లో తుంటి ఫ్రాక్చర్లకు సురక్షిత చికిత్స ?వృద్ధాప్యంలో ఎముకలు బలహీనపడటం వల్ల చిన్నపాటి గాయాలకే తుంటి ఎముకలు విరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, గతంలో ఇటువంటి కేసుల్లో ఎముకలు చాలా మెత్తగా ఉండటం వల్ల మేకులు వేయడం సాధ్యపడక, తప్పనిసరి పరిస్థితుల్లో కీళ్ల మార్పిడి చేయాల్సి వచ్చేది. వయసు పైబడటం వల్ల ఈ సర్జరీల్లో రిస్క్ ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు సరికొత్త 'సిమెంట్ ఆగ్మెంటేషన్' కలిగిన ప్రత్యేకమైన మేకుల ద్వారా కీళ్ల మార్పిడి అవసరం లేకుండానే విరిగిన ఎముకలను విజయవంతంగా అతికించవచ్చని, దీనివల్ల రిస్క్ చాలా తక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ? యువకుల్లో మోకాళ్ల వంకర్ల సవరణ ?యువ రోగులలో మోకాళ్ల వంకర్ల వల్ల వచ్చే ఆస్టియోఆర్థరైటిస్ సమస్యకు 'హై టిబియల్ ఆస్టియోటమీ అనే అలైన్‌మెంట్ కరెక్షన్ సర్జరీ ద్వారా వంకర్లను సరిచేయవచ్చు. ఇది సహజ సిద్ధమైన కీళ్ల ఆయుష్షును పెంచి, సాధారణ జీవనశైలిని సాగించడానికి దోహదపడుతుంది. ?క్రీడాకారుల కీళ్ల గాయాలకు 'కీహోల్' సర్జరీలు ?క్రీడల్లో జరిగే గాయాల వల్ల కీళ్లలోని మృదులాస్థి దెబ్బతిని, బరువు పడినప్పుడు తీవ్రమైన నొప్పి వస్తుందన్నారు. యశోద హాస్పిటల్స్‌లో ఆర్థ్రోస్కోపిక్ సర్జరీ ద్వారా కాండ్రోఫిల్లర్,హైలాఫాస్ట్.ఆటోకార్ట్ వంటి అధునాతన పద్ధతుల్లో దెబ్బతిన్న కార్టిలేజ్ భాగాలను విజయవంతంగా పునర్నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

?ప్రతినెలా జహీరాబాద్‌లో అందుబాటులో..

?ఈ సరికొత్త అధునాతన చికిత్సలన్నీ సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని డాక్టర్ ఆదిత్య రెడ్డి తెలిపారు. జహీరాబాద్ పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఆయన ప్రతినెలా మొదటి మరియు మూడవ శుక్రవారాల్లో జహీరాబాద్‌లోని 'సిటీ సెంటర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్' లో సంప్రదింపుల కు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. మోకాళ్లు, కీళ్ల సమస్యలతో బాధపడే రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దళిత పితామహుడు సాహూ మహారాజు ఆశయాలు ఆదర్శనీయం

-బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి

ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా జూన్ 26: దేశంలో ప్రథమంగా బహుజనులకు వెనుకబడిన వర్గాలకు దళితులకు మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన రిజర్వేషన్ల పితామహుడు మహారాష్ట్రలోని కొల్హాపూర్ సంస్థాన మహారాజు చత్రపతి సాహు అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి తెలిపారు. శు క్రవారం రోజున బీసీ హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు బత్తిని సదానందం అధ్యక్షతన హనుమకొండలో చత్రపతి సాహు మహారాజు 152 వ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బత్తిని సదానందం మాట్లాడుతూ 152 సంవత్సరాల క్రితం జూన్26 1874లో జన్మించిన సాహు మహారాజు గొప్ప సంఘసంస్కర్త అని బడుగు బలహీన వర్గాల

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. సామాజిక న్యాయం ధ్యేయంగా అసమానతల కుల వ్యవస్థను నిర్మూలించడానికి తన పాలనలో బహుజనులను దళితులను పట్వారిగా నియమించుకున్న గొప్ప సామాజిక విప్లవ కారుడని వెట్టి చాకిరిని రద్దుచేసి శూద్రులకు దళితులకు మహిళలకు విద్య అందించిన సామాజిక విప్లవకారుడు సాహు మహారాజు అని కొనియాడారు.ఎలాంటి రాజభోగాలు అనుభవించకుండా దళితవాడలో భోజనం చేస్తూ మనుషులంతా సమానమేనని మనువాదం మానవ మనుగడకు ప్రమాదమని సమానత్వానికి ప్రజాస్వామ్యానికి ప్రత్యేకగా నిలిచాడని పేర్కొన్నారు.కార్యక్రమంలో దొమ్మటి ప్రవీణ్ కుమార్,శాంతి ఉద్యమ నేత ఎర్ర నాగరాజు,నవ చేతన బుక్ హౌస్ మేనేజర్ ఏం.రాజన్ బాబు,పోనుగంటి లక్ష్మీనారాయణ బొచ్చు రవి,దండు మోహన్,న్యాయవాది తిక్క సూర్య ప్రకాష్,ఆకనపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీర్ల పండుగ మత సామరస్యానికి ప్రతీక... మొహర్రం సందర్భంగా ప్రజలకు షర్బత్ పంపిణీ

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 26(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డిలో మొహర్రం ఘనంగా నిర్వహించారు,మొహర్రం సందర్భంగా జగ్గారెడ్డి పాత బస్టాండ్ సమీపంలో దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు,అనంతరం పీర్ల ఊరేగింపు లో పాల్గొన్నారు,పీర్ల ఊరేగింపు చూసేందుకు వందల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు,ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు,ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని కుల మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు మొహర్రం వేడుకల్లో హాజరయ్యారన్నారు,ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సారి మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి అన్నారు,ఈ కార్యక్రమంలో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి,టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్,నాయకులు. కూన సంతోష్,సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్,మైనార్టీ నాయకులు తాహెర్, కుతుబుద్దిన్, నదీం,కౌసర్,ఇమ్రాన్, ఆమెర్ జాన్, హకీమ్,ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

తులం బంగారం కాదు కదా..తులం ఇనుము కూడా ఇవ్వరు: కేటీఆర్

హైదరాబాద్ తెలంగాణ రేవంత్‌రెడ్డి మహిళలకు తులం బంగారం కాదు కదా,తులం ఇనుము కూడా ఇవ్వరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శు క్రవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చేయలేదని, ప్రతి పంటకు బోనస్ ఇస్తానని ఇవ్వలేదన్నారు. రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని మోసం చేశారని, విద్య భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు కాదు ముందు లక్షాధికారులను చేయండి చాలు అని ఎద్దేవా చేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com